

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | శుక్రవారం 28-08-2026 | సంపుటి - 31 | సంచిక - 95 | రూ : 4 | పేజీలు: 8


# టూరిస్టు హబ్‌గా మీరాలం చెరువు

## పురోగతిలో సస్పెన్షన్ బ్రిడ్జి నిర్మాణ పనులు

- అనుబంధంగా దీవుల్లో కన్వెన్షన్ సెంటర్లు, విడిది కేంద్రాలు
- లేజర్ షో, వాటర్ స్పోర్ట్స్, జూపార్కును కలుపుతూ స్కైవాక్
- ఆకస్మిక తనిఖీల్లో అధికారులకు సూచనలిచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి





హైదరాబాద్: పాత, కొత్త, భవిష్యత్తు నగరాలకు చారిత్రక మీరాలం చెరువును ప్రముఖ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులకు స్పష్టం చేశారు. మూసీ పరీవాహక ప్రాంత అభివృద్ధి సంస్థ (ఎంఆర్‌డీసీఎల్) ఆధ్వర్యంలో మీరాలం చెరువుపై 2.6 కి.మీ. పొడవున నిర్మాణమవుతోన్న ఐకానిక్ సస్పెన్షన్ బ్రిడ్జి నిర్మాణ పనులను సీఎం గురువారం ఉదయం ఆకస్మికంగా తనిఖీ చేశారు. భారీ క్రేన్ ఎక్కి చెరువును వీక్షించారు. కాసారంలోని మూడు ప్రధాన దీవులు, పక్కనే జూ పార్కు, చింతల్‌మెట్ వైపున ఉన్న మొఘల్‌పార్కు, ఇతరత్రా హద్దులను చూసి.. వాటన్నింటినీ కలుపుతూ పర్యాటకులను ఆకట్టుకునే వసతులు కల్పించాలని అధికారులకు సూచనలు చేశారు. అక్కడి ఫొటో ప్రదర్శనను తిలకించి, వంతెన పనులను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. "శంషాబాద్ విమానాశ్రయం నుంచి మీరాలం చెరువుకు నిమిషాల్లో చేరుకోవచ్చు. చెరువులోని మూడు దీవులను విడిది, డెస్టినేషన్ వెడ్డింగ్ కేంద్రంగా తీర్చిదిద్దొచ్చు. గ్లాంపింగ్ (టెంట్లు వేయడం) సౌకర్యాలనూ కల్పించొచ్చు. దీవుల నుంచి జూపార్కుకు స్కైవాక్‌ను నిర్మించొచ్చు. కేబుల్ కార్ కూడా మంచి ఎంపిక అవుతుంది. కన్వెన్షన్ సెంటర్లకు వచ్చే అతిథులు పక్కనున్న జూపార్కుతో పాటు పాతబస్తీ, ఫ్యూచర్‌సిటీ, హైటెక్‌సిటీని సందర్శిస్తారు. ఒక్క రోజులో అన్ని ప్రాంతాలను చుట్టేసేంత విశాలమైన రోడ్డు మార్గాలు మీరాలం చెరువుతో అనుసంధానమై ఉన్నాయి. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో మౌలిక సౌకర్యాలను అందుబాటులోకి తెచ్చే ప్రణాళికను రూపొందించండి" అని తరువాయి 2లో






## హైదరాబాద్ నడిబొడ్డున
# తొలి గేటెడ్ కమ్యూనిటీ

2లో



- ఏఎస్‌బీఎల్ భారీ ప్రాజెక్ట్
- ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లో 'ఏఎస్‌బీఎల్ లెగసీ' పేరిట భారీ ప్రాజెక్ట్ ప్రారంభం
- 7.97 ఎకరాల్లో 50 అంతస్తులతో మూడు ఆకాశహర్మ్యాల నిర్మాణం
- 50కి పైగా ఆధునిక సౌకర్యాలతో 3, 4 బీహెచ్‌కే ఫ్లాట్లు
- స్టాండలోన్ భవనాలకు భిన్నంగా కొత్త జీవనశైలిని పరిచయం చేయడమే లక్ష్యం



## కర్ణాటక విద్యుత్ సంస్థతో
# సింగరేణి జాయింట్ వెంచర్

- ఆ రాష్ట్ర ప్రభుత్వానికి భట్టి ప్రతిపాదన
- బంగారం, రాగి సర్వే పనుల ప్రారంభం

హైదరాబాద్: సింగరేణి, కర్ణాటక విద్యుత్ సంస్థ (కేపీసీఎల్) సంయుక్త భాగస్వామ్యంతో (జాయింట్ వెంచర్) కలిసి పనిచేద్దామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆ రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదించారు. గురువారం బెంగళూరులో కర్ణాటక ఇంధనశాఖ మంత్రి కె.జె.జార్జ్‌తో ఆయన సమావేశమయ్యారు. రెండు రాష్ట్రాల మధ్య ఇంధన రంగ పురోగతి, బొగ్గు సరఫరా, సాంకేతికత మార్పిడిపై ఈ సందర్భంగా చర్చించారు. సమావేశంలో కర్ణాటక అదనపు ప్రత్యేక ప్రధాన కార్యదర్శి తరువాయి 2లో



## క్రీడా ప్రతిభకు
# ప్రాంతాలతో సంబంధం లేదు

- గ్రామాలు, పట్టణాల నుంచీ ఛాంపియన్లు రావాలి: కిషన్‌రెడ్డి

హైదరాబాద్: క్రీడా ప్రతిభకు ప్రాంతాలతో సంబంధం లేదని... ప్రతిభ ఉన్న ప్రతి ఒక్కరూ రాణించేందుకు సహకారం అందిస్తామని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి తెలిపారు. గ్రామాలు, పట్టణాలతో పాటు దేశంలోని ప్రతి ప్రాంతం నుంచీ తరువాయి 2లో

# కాన్పూర్‌లో కూలిన శిక్షణ విమానం..
## ఇద్దరు పైలట్లు మృతి

- యూపీలోని కాన్పూర్‌లో విమాన ప్రమాదం
- ప్రమాదంలో పైలట్, కో-పైలట్ అక్కడికక్కడే మృతి
- గంగా నది సమీపంలోని పొలాల్లో కూలిన విమానం
- నియంత్రణ కోల్పోవడంతోనే ప్రమాదం జరిగిందని అంచనా



ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌లో గురువారం ఘోర విమాన ప్రమాదం సంభవించింది. ఒక ట్విన్ ఇంజిన్ శిక్షణ విమానం గంగా నది సమీపంలోని వ్యవసాయ క్షేత్రాల్లో కుప్పకూలింది. ఈ దుర్ఘటనలో విమానంలో ఉన్న పైలట్, కోపైలట్ ఇద్దరూ అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. శిక్షణలో భాగంగా గగనతలానికి ఎగిరిన ఈ విమానం, కొద్దిసేపటికే సాంకేతిక లోపం లేదా ఇతర కారణాలతో నియంత్రణ కోల్పోయి నేరుగా పొలాల్లో కూలిపోయినట్లు అధికారులు ప్రాథమికంగా వెల్లడించారు. ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, తరువాయి 2లో

# ఉజ్బెకిస్థాన్, కిర్గిస్థాన్‌లకు మోదీ



- రేపట్నుంచి నాలుగు రోజుల విదేశీ పర్యటన

2లో

## అమెరికా వీసా ఇంటర్వ్యూల నిలిపివేత

# మేటవేసిన మృత్యువు

- నేపాల్‌లో 392కు పెరిగిన మృతుల సంఖ్య
- 30 దేశాలకు చెందిన 1500 మంది గల్లంతు!
- వారిలో 288 మంది భారతీయులు
- కొందరు తెలుగువారూ..
- టిబెట్‌లోనూ భారీ విధ్వంసం
- కన్నీరు మిగిల్చిన వరద, బురద
- అంచనాలకందని నష్టం
- కొనసాగుతున్న సహాయక చర్యలు
- భారీ సాయం పంపిన భారత్



కాఠ్మాండూ: నేపాల్‌లో ఎక్కడ చూసినా వరద విధ్వంసక దృశ్యాలే దర్శనమిస్తున్నాయి. గురువారం వెలుగులోకి వచ్చిన వీడియోల్లోని దృశ్యాలు మరింత భయానకంగా ఉన్నాయి. రసువా జిల్లాలో కొన్ని అడుగుల ఎత్తున మొదలైన వరద, బురద ప్రవాహం పోటెత్తి.. దిగువకు ప్రవహించి.. పలు జిల్లాల్లో బీభత్సం సృష్టించింది. పలు భవనాలు పేకమేడల్లా కూలిపోయాయి. వాహనాలు కాగితపు పడవల్లా కొట్టుకుపోయాయి. పరుగెత్తుతున్న ప్రజలను వరద కమ్మేసింది. జంతువులు, చెట్లు వరదలో కలిసిపోయాయి. భూకంపంతో మంచు, రాళ్లు, శిథిలాలు కొట్టుకొచ్చి లిండే నదిలో ప్రవాహానికి తాత్కాలికంగా అడ్డుపడ్డాయి. అడ్డంకి తొలగిపోగానే అది ఉప్పెనై భారీగా వరద, బురద దిగువకు పోటెత్తింది. అది భోటే కోశీ, త్రిశూలి నదుల ప్రవాహాన్ని బీభత్సం చేసింది. టిబెట్‌లోనూ వరద భారీ విధ్వంసం సృష్టించింది. భవనాలకు భవనాలే నేలమట్టమయ్యాయి. తరువాయి 2లో

# టూరిస్టు హబ్‌గా మీరాలం చెరువు

హైదరాబాద్: పాత, కొత్త, భవిష్యత్తు నగరాలకు చారిత్రక మీరాలం చెరువును ప్రముఖ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులకు స్పష్టం చేశారు. మూసీ పరీవాహక ప్రాంత అభివృద్ధి సంస్థ(ఎంఆర్‌డీసీఎల్) ఆధ్వర్యంలో మీరాలం చెరువుపై 2.6 కి.మీ. పొడవున నిర్మాణమవుతోన్న ఐకానిక్ సస్పెన్షన్ బ్రిడ్జి నిర్మాణ పనులను సీఎం గురువారం ఉదయం ఆకస్మికంగా తనిఖీ చేశారు. భారీ క్రేన్ ఎక్కి చెరువును వీక్షించారు. కాసారంలోని మూడు ప్రధాన దీవులు, పక్కనే జూ పార్కు, చింతల్‌మెట్ వైపున ఉన్న మొఘల్‌పార్కు, ఇతరత్రా హద్దులను చూసి.. వాటన్నింటినీ కలుపుతూ పర్యాటకులను ఆకట్టుకునే వసతులు కల్పించాలని అధికారులకు సూచనలు చేశారు. అక్కడి ఫొటో ప్రదర్శనను తిలకించి, వంతెన పనులను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. "శంషాబాద్ విమానాశ్రయం నుంచి మీరాలం చెరువుకు నిమిషాల్లో చేరుకోవచ్చు. చెరువులోని మూడు దీవులను విడిది, డెస్టినేషన్ వెడ్డింగ్ కేంద్రంగా తీర్చిదిద్దొచ్చు. గ్లాంపింగ్ (టెంట్లు వేయడం) సౌకర్యాలనూ కల్పించొచ్చు. దీవుల నుంచి జూపార్కుకు స్కైవాక్‌ను నిర్మించొచ్చు. కేబుల్ కార్ కూడా మంచి ఎంపిక అవుతుంది. కన్వెన్షన్ సెంటర్లకు వచ్చే అతిథులు పక్కనున్న జూపార్కుతో పాటు పాతబస్తీ, ఫ్యూచర్‌సిటీ, హైటెక్‌సిటీని సందర్శిస్తారు. ఒక్క రోజులో అన్ని ప్రాంతాలను చుట్టేసేంత విశాలమైన రోడ్డు మార్గాలు మీరాలం చెరువుతో అనుసంధానమై ఉన్నాయి. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో మౌలిక సౌకర్యాలను అందుబాటులోకి తెచ్చే ప్రణాళికను రూపొందించండి" అని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు.

**కుటుంబమంతా కలిసి వచ్చేట్టు..**

"చెరువు చుట్టూ మురుగు నీటికి ప్రత్యేక పైపులైను వేయండి. వాటిని ప్రస్తుతమున్న రెండు మురుగు శుద్ధి కేంద్రాలతో అనుసంధానించి.. 100 శాతం శుద్ధి చేసిన నీటినే చెరువులోకి వదలాలి. చెరువులో చిన్నాపెద్ద కలిసి వాటర్ స్పోర్ట్స్ ఆడుకునేలా పరిసరాలను తీర్చిదిద్దాలి. గుర్రపుడెక్కను పూర్తిగా తొలగించి, తటాకాన్ని మంచి నీటితో నింపండి. కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధులతో జూపార్కును మరింతగా అభివృద్ధి చేయాలి. బోటింగ్, సాహస క్రీడలను అందుబాటులోకి తెచ్చేందుకు ప్రణాళిక రూపొందించండి. కుటుంబమంతా కలిసి జూపార్కు మీరాలం చెరువును సందర్శించేట్లు ఏర్పాట్లు ఉండాలి. చెరువు, జూపార్కుతో చింతల్‌మెట్ వైపు ఉన్న మొఘల్ పార్కును కూడా అనుసంధానం చేసి.. భారీ వాక్ వే, సైకిల్ ట్రాక్‌లను నిర్మించండి" అని సీఎం జలమండలి అధికారులను ఆదేశించారు.

**చకచకా వంతెన పనులు**

"మీరాలం చెరువు ఐకానిక్ బ్రిడ్జి పిల్లర్లకు సంబంధించిన పునాది పనులు దాదాపు 50.18% పూర్తయ్యాయి. దాదాపు 20 పిల్లర్లు భూ ఉపరితలంపైన ఐదడుగుల ఎత్తున నిర్మాణమయ్యాయి. వంతెన పనులు, దీవుల అభివృద్ధి, జూపార్కు పునర్ నిర్మాణం పూర్తయితే హైదరాబాద్‌కు మీరాలం చెరువు ప్రముఖ గమ్యస్థానంలా మారుతుంది" అని అధికారులు సీఎంకు వివరించారు. సీఎం వెంట ఎంఆర్‌డీసీఎల్ ఎండీ నర్సింహారెడ్డి, జేఎండీ గౌతమి ఉన్నారు.

## ఉజ్బెకిస్థాన్, కిర్గిస్థాన్‌లకు మోదీ

దిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కీలక ద్వైపాక్షిక, బహుపాక్షిక సమావేశాలకు సిద్ధమవుతున్నారు. ఈ నెల 29 నుంచి సెప్టెంబరు 1 వరకు ఉజ్బెకిస్థాన్, కిర్గిస్థాన్‌లలో మోదీ పర్యటించనున్నారు. పర్యటనలో భాగంగా కిర్గిస్థాన్ రాజధాని బిష్కెక్‌లో జరిగే షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీవో) సదస్సులో పాల్గొని, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో మోదీ ప్రత్యేకంగా సమావేశం కానున్నారు. ఈ భేటీలో ఇరు దేశాల మధ్య ఉన్న ద్వైపాక్షిక సంబంధాలను నేతలిద్దరూ సమగ్రంగా సమీక్షించనున్నారని విదేశీ వ్యవహారాల శాఖ కార్యదర్శి సిబీ జార్జ్ తెలిపారు. కిర్గిస్థాన్ అధ్యక్షుడు సాదిర్ జాపరోవ్ ఆహ్వానం మేరకు ఎస్‌సీవో సదస్సుకు హాజరవుతున్న మోదీ చివరిరోజు ప్లీనరీలో ప్రసంగిస్తారు. ఎస్‌సీవో దేశాల ఇతర నేతలతో కలిసి ఆరో వరల్డ్ నోమాడ్ గేమ్స్ ప్రారంభ వేడుకలకు మోదీ హాజరవుతారు. ఎస్‌సీవో సదస్సుకు పుతిన్‌తోపాటు చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్, పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ తదితరులు హాజరయ్యే అవకాశముంది. 2017 నుంచి భారత్ పూర్తిస్థాయి సభ్య దేశంగా ఉన్న ఈ శిఖరాగ్ర సదస్సు 25వ వార్షికోత్సవాన్ని జరుపుకోనుంది. కిర్గిస్థాన్ కంటే ముందు 29, 30 తేదీల్లో ఉజ్బెకిస్థాన్‌లో ప్రధాని పర్యటిస్తారు. ఆ దేశ అధ్యక్షుడు షౌకత్ మిర్జియోయెవ్ ఆహ్వానం మేరకు తాష్కెంట్‌కు వెళతారు. ఇది ఉజ్బెకిస్థాన్‌లో మోదీకి నాలుగో పర్యటన. తాష్కెంట్‌లో మిర్జియోయెవ్‌తో మోదీ ప్రతినిధి స్థాయి చర్చలు జరపనున్నారు. భారత్ ఉజ్బెకిస్థాన్ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడమే ఈ చర్చల ప్రధాన ఉద్దేశం. వాణిజ్యం, పెట్టుబడులు, రక్షణ, డిజిటల్ కనెక్టివిటీ, ఇంధనం, విద్య, ప్రజల మధ్య సంబంధాలు వంటి అంశాలపై ఇరు దేశాల నేతలు చర్చించనున్నారు. తాష్కెంట్‌లో శాస్త్రి మెమోరియల్, తాష్కెంట్ స్టేట్ యూనివర్సిటీ ఆఫ్ ఓరియంటల్ స్టడీస్‌లోని మహాత్మాగాంధీ కేంద్రాన్ని మోదీ సందర్శించనున్నారు.

## కర్ణాటక విద్యుత్ సంస్థతో సింగరేణి జాయింట్ వెంచర్

హైదరాబాద్: సింగరేణి, కర్ణాటక విద్యుత్ సంస్థ (కేపీసీఎల్) సంయుక్త భాగస్వామ్యంతో (జాయింట్ వెంచర్) కలిసి పనిచేద్దామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆ రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదించారు. గురువారం బెంగళూరులో కర్ణాటక ఇంధనశాఖ మంత్రి కె.జె.జార్జ్‌తో ఆయన సమావేశమయ్యారు. రెండు రాష్ట్రాల మధ్య ఇంధన రంగ పురోగతి, బొగ్గు సరఫరా, సాంకేతికత మార్పిడిపై ఈ సందర్భంగా చర్చించారు. సమావేశంలో కర్ణాటక అదనపు ప్రత్యేక ప్రధాన కార్యదర్శి గౌరవ్ గుప్తా, కేపీసీఎల్ ఎండీ రాజేంద్ర చోళన్ ఇతర అధికారులు పాల్గొన్నారు. ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాల్లో బొగ్గు తవ్వకంలో సింగరేణి సంస్థతో కేపీసీఎల్ కలిసి పనిచేస్తే బాగుంటుందని భట్టి ప్రతిపాదించగా.. జార్జ్ సానుకూలంగా స్పందించారు. కర్ణాటకలో పారిశ్రామిక ప్రగతి కారణంగా విద్యుత్‌కు డిమాండ్ పెరుగుతోందని, థర్మల్ ప్లాంట్లకు తెలంగాణ బొగ్గును నిరంతరం సరఫరా చేయాలని జార్జ్ కోరగా భట్టి సానుకూలంగా స్పందించారు.

* **బంగారం, రాగి వెలికితీసి దేశ సంపదను పెంచుదాం..**

కర్ణాటకలోని దేవదుర్గ్ గని నుంచి బంగారం, రాగి ఖనిజాలను వెలికితీసి దేశ సంపదను పెంపొందించడానికి కలిసికట్టుగా కృషి చేద్దామని భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. రాయచూరు జిల్లా దేవదుర్గ్ తాలూకా లింగదహళ్లి గ్రామంలో సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో రాగి, బంగారం అన్వేషణ (సర్వే) కార్యక్రమాన్ని గురువారం భట్టి ప్రారంభించారు. సింగరేణి సీఎండీ బుద్ధప్రకాష్ పాల్గొన్నారు. అనంతరం భట్టి విక్రమార్క ఖనిజ అన్వేషణ ప్రదేశాలకు వెళ్లి పరిశీలించారు. కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన టెండర్లలో దేవదుర్గ్ బ్లాక్ ఎక్స్‌ప్లోరేషన్ (అన్వేషణ) హక్కులను దక్కించుకున్న విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఇక్కడ బంగారం, రాగి విరివిగా లభిస్తే యువతకు ఉపాధి లభించడమే కాకుండా శీఘ్రగతిన అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. సింగరేణి ఆధ్వర్యంలో త్వరలోనే ఆఫీస్‌ను, హెలిప్యాడ్‌ను కూడా ఏర్పాటుచేయనున్నట్లు ప్రకటించారు. కృష్ణానదికి ఇరువైపులా ఉన్న తెలుగు, కర్ణాటక ప్రజల మధ్య విడదీయరాని బంధం ఉందని భట్టి పేర్కొన్నారు. అనంతరం ఆ ప్రాంతంలో సింగరేణి అధికారులు సేకరించిన వివిధ రకాల ఖనిజ నమూనాలతో ఏర్పాటుచేసిన ఎగ్జిబిషన్‌ను తిలకించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. లింగదహళ్లి గ్రామంలోని పరమానంద శివాలయంలో ఆయన పూజలు నిర్వహించారు.

### అమెరికా వీసా
## ఇంటర్వ్యూల నిలిపివేత

వాషింగ్టన్: అమెరికాకు వలసలను నియంత్రించడంపై దృష్టిపెట్టిన ట్రంప్ సర్కారు.. ప్రపంచవ్యాప్తంగా అన్ని ఇమిగ్రెంట్ వీసా ఇంటర్వ్యూలను తాత్కాలికంగా నిలిపివేసింది. వీసా నిబంధనలను మరింత కఠినతరం చేయడం, స్థానిక ప్రభుత్వం నుంచి అందే ప్రయోజనాలపై ఆధారపడే అవకాశమున్నవారి రాకను అడ్డుకోవడమే లక్ష్యంగా ఈ చర్యకు ఉపక్రమించింది. ఓ వార్తాసంస్థ తాజాగా వెల్లడించిన వివరాల ప్రకారం వీసా దరఖాస్తులను సమగ్రంగా, నిలకడగా మదింపు చేయడంపై తమ కాన్సులర్ అధికారులకు అమెరికా ప్రస్తుతం ప్రత్యేక శిక్షణ అందిస్తోంది. 'పబ్లిక్ ఛార్జ్' నిర్వచనం పరిధిలోకి వచ్చే వ్యక్తులను గుర్తించడమెలాగో వారికి తర్ఫీదునిస్తోంది. ఆర్థిక మద్దతు కోసం ప్రధానంగా ప్రభుత్వంపై ఆధారపడేవారిని అమెరికా 'పబ్లిక్ ఛార్జ్'గా పరిగణిస్తుంటుంది. వలస వచ్చే విదేశీయుల్లో ఇలాంటి వారుంటే.. అర్హులైన అమెరికన్లకు ప్రభుత్వ ప్రయోజనాలు తక్కువగా అందుతాయని ట్రంప్ సర్కారు భావిస్తోంది. ఈ నేపథ్యంలో 'పబ్లిక్ ఛార్జ్'గా మారే అవకాశమున్న దరఖాస్తుదారులను గుర్తించడంపై ప్రత్యేక దృష్టిపెట్టింది. కాన్సులర్ అధికారులకు శిక్షణ కొనసాగుతుండటంతో.. ప్రపంచవ్యాప్తంగా అన్ని ఎంబసీలు, కాన్సులేట్లలో ఇమిగ్రెంట్ వీసా ఇంటర్వ్యూలను తాత్కాలికంగా నిలిపివేసింది. వాటన్నింటినీ రీషెడ్యూలు చేస్తామని.. కొత్త అపాయింట్‌మెంట్ల తేదీలను దరఖాస్తుదారులకు త్వరలో తెలియజేస్తామని పేర్కొంది. 'పబ్లిక్ ఛార్జ్'గా మారతారన్న ఆందోళనతో పలు దేశాల ప్రజలకు ఇమిగ్రెంట్ వీసాలు మంజూరు కాకుండా ట్రంప్ సర్కారు కొన్నాళ్లుగా ప్రయత్నాలు చేస్తున్న సంగతి గమనార్హం.

**అదనపు ఫీజుతో అమెరికాకే నష్టం**

హెచ్1బీ వీసాలపై 1,03,265 డాలర్ల అదనపు ఫీజు భారం మోపేందుకు ట్రంప్ సర్కారు చేసిన నూతన ప్రతిపాదన అమెరికాకే నష్టం కలిగించే ముప్పుందని భారతీయ అమెరికన్ అడ్వొకసీ గ్రూప్ 'ద ఫౌండేషన్ ఫర్ ఇండియా అండ్ ఇండియన్ డయాస్పొరా స్టడీస్ (ఎఫ్ఐఐడీఎస్)' పేర్కొంది. ఈ రుసుము కారణంగా హై వాల్యూ ఉద్యోగాలు అమెరికా నుంచి విదేశాలకు తరలిపోతాయని అభిప్రాయపడింది.

(మొదటిపేజీ తరువాయి)

**మరణ మృదంగం**

నేపాల్‌లో బుధవారం సంభవించిన విపత్తులో మరణించిన వారి సంఖ్య 389కి చేరుకుంది. మరో 910 మందికిపైగా గల్లంతయ్యారు. టిబెట్‌లో ముగ్గురు మృతి చెందగా.. 558 మంది గల్లంతయ్యారు. గురువారంనాటికి మరణాలు 392గా, గల్లంతైనవారు 1,468గా తేలారు. నేపాల్‌లో 288 మంది భారతీయుల జాడ తెలియడం లేదని భారత విదేశీ వ్యవహారాలశాఖ వెల్లడించింది. ఇందులో తెలుగువారూ ఉన్నారు. మరో 200 మంది టిబెట్ భూభాగంలో చిక్కుకుపోయారని తెలిపింది. సాగ్రమాట్ ట్రావెల్స్‌ద్వారా 37 మంది, ఫై ఎవరెస్టు ట్రావెల్ సంస్థద్వారా 49 మంది తమిళనాడుకు చెందినవారు మానసరోవర్ యాత్రకు వెళ్లారని, వారి ఆచూకీ తెలియడం లేదని విదేశీ వ్యవహారాలశాఖ అధికార ప్రతినిధి రణధీర్ జయస్వాల్ తెలిపారు. కర్ణాటక నుంచి వెళ్లిన 13మంది ఆచూకీ అందలేదు. 590 మంది పర్యాటకుల జాడ తెలియడం లేదని, అందులో 476 మంది విదేశీయులు, 114 మంది నేపాలీలు ఉన్నారని నేపాల్ పర్యాటకశాఖ వెల్లడించింది. 30 దేశాలకు చెందిన యాత్రికులు ఇందులో ఉన్నారని పేర్కొంది. నేపాల్‌లో ఇప్పటిదాకా 389 మృతదేహాలు లభ్యమయ్యాయి. చితవాన్ జిల్లాలో మరణ మృదంగం మోగింది. అక్కడ ఏకంగా 132 మృతదేహాలను సహాయక సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు. తూర్పు నవాల్‌పరసీలో 62, ధాడింగ్‌లో 27, గూర్ఖాలో 20, రసువాలో 17, పశ్చిమ నవాల్‌పరసీలో 15, నువాకోట్‌లో 12 మృతదేహాలు లభ్యమయ్యాయి. వేల కుటుంబాలు ఇళ్లను కోల్పోయాయని, అందులో చాలా మంది గల్లంతయ్యారని నేపాల్ విదేశాంగశాఖ మంత్రి శిశిర్ ఖనల్ తెలిపారు. జల విద్యుత్తు ప్రాజెక్టులు, కస్టమ్స్ కార్యాలయాల్లో పనిచేస్తున్న 160 మంది జాడ తెలియడం లేదు.

**భారీ విధ్వంసం**

వరద, బురద ముంచెత్తడంతో మధ్య నేపాల్‌లో 35 వంతెనలు, 45 సస్పెన్షన్ వంతెనలు, 40 కిలోమీటర్ల రోడ్లు ధ్వంసమయ్యాయి.

## మేటవేసిన మృత్యువు

కాఠ్‌మాండూను ఇతర ప్రాంతాలతో కలిపే రహదారి తీవ్రంగా దెబ్బతింది. టిబెట్‌లో: టిబెట్‌లో 558 మంది గల్లంతయ్యారు. వీరిలో 260 మంది విదేశీయులున్నారు. మిగిలిన 100 మంది స్థానికులు. దెబ్బతిన్న ప్రాంతాలను గురువారం చైనా ప్రధాని లీ కియాంగ్ సందర్శించారు.

* **11 మంది భారతీయులను రక్షించిన సిబ్బంది**

ఇప్పటిదాకా 84 మంది భారతీయులను సురక్షిత ప్రదేశాలకు చేర్చామని భారత విదేశీ వ్యవహారాలశాఖ వెల్లడించింది. ఇందులో త్రిశూల్ విద్యుత్తు ప్రాజెక్టువద్ద పనిచేసే 63 మంది ఉద్యోగులున్నారు. 27 మంది విదేశీ పర్యాటకులను సహాయక సిబ్బంది రక్షించారు. వారిలో 11 మంది భారతీయులున్నారు. కాఠ్‌మాండూలోని త్రిభువన్ ఆసుపత్రివద్ద వందల మంది గుమికూడారు. తమవారి ఆచూకీ కోసం అన్వేషిస్తూ కనిపించారు. బుధవారం నుంచి 47.5 టన్నుల అత్యవసర సామగ్రిని నేపాల్‌కు భారత్ పంపింది. విపత్తు పరిస్థితిపై విదేశీ వ్యవహారాలశాఖ మంత్రి జైశంకర్ సమీక్ష జరిపారు.

**పొంచి ఉన్న మరో ముప్పు?**

కాఠ్‌మాండూ: నేపాల్‌కు మరో వరద ముప్పు పొంచి ఉందని చైనా హెచ్చరిస్తోంది. భోటే కోశీ నదికి దిగువనున్న రసువా జిల్లాలో ఒక ఆనకట్ట తరహా ఆకృతి ఏర్పడిందని, అందులో భారీగా నీరు చేరుతోందని, అది మరింతగా పెరిగి.. రాబోయే 3 రోజుల్లో ఎప్పుడైనా బద్దలయ్యే అవకాశముందని అంటోంది. ఈ ప్రాంతం నేపాల్‌టిబెట్ సరిహద్దులో రెండు నదుల సంగమ ప్రదేశంవద్ద ఉంది. భోటే కోశీ, త్రిశూలి నదీ తీరాలకు ప్రజలు దూరంగా ఉండాలని, తాము తిరిగి చెప్పేవరకూ సురక్షిత ప్రాంతాలను వదిలి రావద్దని నేపాల్ ప్రభుత్వం అప్రమత్తం చేసింది.

### కాన్పూర్‌లో కూలిన శిక్షణ విమానం..
## ఇద్దరు పైలట్లు మృతి



ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌లో గురువారం ఘోర విమాన ప్రమాదం సంభవించింది. ఒక ట్విన్ ఇంజిన్ శిక్షణ విమానం గంగా నది సమీపంలోని వ్యవసాయ క్షేత్రాల్లో కుప్పకూలింది. ఈ దుర్ఘటనలో విమానంలో ఉన్న పైలట్, కోపైలట్ ఇద్దరూ అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. శిక్షణలో భాగంగా గగనతలానికి ఎగిరిన ఈ విమానం, కొద్దిసేపటికే సాంకేతిక లోపం లేదా ఇతర కారణాలతో నియంత్రణ కోల్పోయి నేరుగా పొలాల్లో కూలిపోయినట్లు అధికారులు ప్రాథమికంగా వెల్లడించారు. ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, అత్యవసర సేవల సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. అయితే, ఈ ప్రమాదానికి గల కచ్చితమైన కారణాలు ఇంకా తెలియాల్సి ఉంది. ఈ ఘటనపై ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదంలో మరణించిన పైలట్ల ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆ కుటుంబాలకు ఈ తీరని లోటును భరించే శక్తిని భగవంతుడు ప్రసాదించాలని ఆయన ఆకాంక్షించారు. కాగా, ప్రమాద కారణాలపై అధికారులు ఇప్పటికే సమగ్ర దర్యాప్తు ప్రారంభించారు.

## క్రీడా ప్రతిభకు ప్రాంతాలతో సంబంధం లేదు

హైదరాబాద్: క్రీడా ప్రతిభకు ప్రాంతాలతో సంబంధం లేదని... ప్రతిభ ఉన్న ప్రతి ఒక్కరూ రాణించేందుకు సహకారం అందిస్తామని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి తెలిపారు. గ్రామాలు, పట్టణాలతోపాటు దేశంలోని ప్రతి ప్రాంతం నుంచి అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులు వెలుగులోకి రావాలని ఆకాంక్షించారు. హైదరాబాద్‌లోని ఇంగ్లిష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ(ఇఫ్లూ)లో గురువారం నిర్వహించిన 'ఖేలో ఇండియా సంవాద్... ఖేల్ కీ బాత్ పీఎం కే సాథ్' కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ఒలింపిక్స్‌కు భారత యువతను సిద్ధం చేయాల్సిన అవసరం ఉందన్నారు. క్రీడలను కేవలం పాఠ్యేతర అంశంగా చూసే విధానంలో మార్పు వచ్చిందని చెప్పారు. అభివృద్ధి, ఆరోగ్యం, క్రమశిక్షణ, ఉపాధి, జాతీయ గౌరవం, దేశ నిర్మాణానికి క్రీడలను కీలక సాధనంగా పరిగణిస్తున్నట్లు పేర్కొన్నారు. భారత క్రీడాకారుల విజయాలు.. ఒలింపిక్ పోడియంపై నిలవడం తమకూ సాధ్యమేనన్న నమ్మకాన్ని యువతలో పెంచుతున్నాయన్నారు. దేశంలో 2014 తర్వాత క్రీడారంగంలో ప్రభుత్వ పెట్టుబడులు గణనీయంగా పెరిగాయని కిషన్‌రెడ్డి తెలిపారు. దేశవ్యాప్తంగా 1,500కుపైగా విద్యాసంస్థలు 'ఖేలో ఇండియా సంవాద్'లో పాల్గొంటున్నాయని చెప్పారు. యువత తమ ఆలోచనలను నేరుగా ప్రధానమంత్రితో పంచుకునేందుకు ఈ కార్యక్రమం విలువైన వేదికగా నిలుస్తోందన్నారు. కార్యక్రమంలో ఇఫ్లూ వీసీ ప్రొఫెసర్ ఎన్. నాగరాజు, రిజిస్ట్రార్ సినీ మంచాల, పత్రికా సమాచార కార్యాలయం అదనపు డైరెక్టర్ జనరల్ శ్రుతి పాటిల్, అథ్లెట్ జె.జె. శోభ, బ్యాడ్మింటన్ క్రీడాకారిణి శ్రీయాన్షి వలిశెట్టి తదితరులు పాల్గొన్నారు.



## రాఖీ పౌర్ణమికి 5 వేల ప్రత్యేక బస్సులు: మంత్రి

హైదరాబాద్: రాఖీ పండగ సందర్భంగా ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ఆర్టీసీ 5 వేల ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఈ ప్రత్యేక సర్వీసులు 27వ తేదీ గురువారం నుంచి ప్రారంభమై ఆగస్టు 31 సోమవారం వరకు ప్రయాణికులకు అందుబాటులో ఉంటాయని వెల్లడించారు. రవాణా, రోడ్లు భవనాలశాఖ ప్రత్యేక ప్రధానకార్యదర్శి వికాస్‌రాజ్, ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డితో కలిసి మంత్రుల క్వార్టర్స్‌లోని తన నివాసంలో గురువారం ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. "గతేడాది రాఖీ పౌర్ణమికి 4,760 ప్రత్యేక బస్సులను నడిపించగా... ఈసారి అదనంగా 240 పెంచాం. గతేడాది ప్రత్యేక బస్సుల్లో సుమారు 3.68 కోట్ల మంది ప్రయాణించగా, అందులో 2.51 కోట్ల మంది మహిళా ప్రయాణికులున్నారు" అని తెలిపారు.

# నేషనల్ హైవేపై బెల్ట్ షాపులు నిషేధించాలి

: హైవేపై ట్రాఫిక్ నిలిపితే కఠిన చర్యలు

* ప్రతి దుకాణంలో సీసీ కెమెరాలు తప్పనిసరి: ఎస్సై బి. శ్రీకాంత్ గౌడ్



గరిడేపల్లి, ప్రజాస్ఫూర్తి : నేషనల్ హైవేపై ఉన్న బెల్ట్ షాపులపై ప్రత్యేక దృష్టి సారించాలని, అక్రమంగా మద్యం విక్రయించే దుకాణాలను నియంత్రించేందుకు చర్యలు తీసుకుంటా అన్ని ఎస్సై శ్రీకాంత్ గౌడ్ అన్నారు. గరిడేపల్లి మండల కేంద్రంలోని నేషనల్ హైవే వెంట ఉన్న బెల్ట్ షాపులు, హోటళ్లు, కిరాణా దుకాణాల యజమానులను గరిడేపల్లి ఎస్సై బి. శ్రీకాంత్ గౌడ్ పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ నేషనల్ హైవే వెంట ఉన్న ప్రతి దుకాణంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. దుకాణాల వద్ద జరిగే ప్రతి కార్యకలాపం నిఘాలో ఉండేలా కెమెరాలను ఏర్పాటు చేయడం ద్వారా భద్రతను మరింత పెంచవచ్చని తెలిపారు. దుకాణ యజమానులు పోలీసులకు సహకరించి, ఎలాంటి అనుమానాస్పద కార్యకలాపాలకు అవకాశం ఇవ్వకూడదని సూచించారు. అదేవిధంగా నేషనల్ హైవేపై వాహనాలను ఇష్టారాజ్యంగా నిలిపి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించవద్దని ఎస్సై హెచ్చరించారు. ముఖ్యంగా హోటళ్లు, కిరాణా దుకాణాలు, ఇతర వ్యాపార సంస్థల ముందు వాహనాలను రోడ్డుపై నిలిపివేయడం వల్ల ప్రమాదాలకు అవకాశం ఉంటుందని తెలిపారు. బెల్ట్ షాపులపై చర్యలు తీసుకోవాలినేషనల్ హైవే పరిధిలో అనుమతులు లేకుండా మద్యం విక్రయించేబెల్ట్ షాపులను నియంత్రించేందుకు సంబంధిత అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. హైవే వెంట బెల్ట్ షాపుల నిర్వహణతో పాటు మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల ప్రమాదాల ముప్పు పెరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.పోలీసులు నిర్వహించిన కౌన్సెలింగ్‌తోపాటు నిబంధనలను ఉల్లంఘించే వారిపై నిరంతర నిఘా కొనసాగించాలని ప్రజలు కోరుతున్నారు. నేషనల్ హైవే భద్రత, ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు పోలీసులతో పాటు వ్యాపారులు, వాహనదారులు, ప్రజలు సహకరించాలని ఎస్సై సూచించారు.

## రోడ్లపై పశువులను విచ్చలవిడిగా వదిలితే చర్యలు

* మున్సిపల్ కమిషనర్ వంశీకృష్ణ



ప్రజాస్ఫూర్తి , నల్లగొండ : నల్లగొండ నగరపాలక సంస్థ పరిధిలోని ప్రధాన రహదారులు, వీధుల్లో పశువులను విచ్చలవిడిగా వదిలివేయడం వల్ల వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని నగరపాలక సంస్థ కమిషనర్ బి. వంశీ కృష్ణ తెలిపారు. రోడ్లపై పశువులు సంచరించడం వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం కలగడంతో పాటు, పశువులు అకస్మాత్తుగా వాహనాల ముందుకు రావడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, ప్రజల భద్రతకు ముప్పు ఏర్పడే అవకాశం ఉందని పేర్కొన్నారు.పశువుల యజమానులు తమ పశువులను రోడ్లపైకి వదలకుండా తమ సొంత స్థలాల్లో లేదా సురక్షితమైన ప్రదేశాల్లోనే ఉంచుకోవాలని కమిషనర్ సూచించారు. రోడ్లపై పశువులను విచ్చలవిడిగా వదిలే యజమానులకు నగరపాలక సంస్థ అధికారులు నోటీసులు జారీ చేసి, 7 రోజులలోపు పశువులను రోడ్లపైకి రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించనున్నట్లు తెలిపారు.7 రోజుల గడువు అనంతరం కూడా పశువులను రోడ్లపైకి వదిలినట్లయితే, సంబంధిత యజమానులపై మున్సిపల్ చట్టం 2019 ప్రకారం జరిమానాలు విధించడంతో పాటు తదుపరి చర్యలు తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు. అదేవిధంగా, రోడ్లపై విచ్చలవిడిగా సంచరిస్తున్న పశువులను నగరపాలక సంస్థ సిబ్బంది పట్టుకొని గోశాలలకు తరలించడంతో పాటు, పశువుల యజమానులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. పశువుల యజమానులు తమ పశువులను రోడ్లపైకి వదలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కమిషనర్ కోరారు.

## సూర్యాపేట జిల్లా బీజేపీ కిసాన్ మోర్చా జనరల్ సెక్రెటరీగా చిత్తలూరి సోమయ్య గౌడ్



సూర్యాపేట ప్రజాస్ఫూర్తి: భారతీయ జనతా పార్టీ సూర్యాపేట జిల్లా కిసాన్ మోర్చా జనరల్ సెక్రెటరీగా (ప్రధాన కార్యదర్శి) గరిడేపల్లి మండలానికి చెందిన ప్రముఖ *నాయకులు చిత్తలూరి సోమయ్య గౌడ్ నియమితులయ్యారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు ఆదేశాల మేరకు, సూర్యాపేట జిల్లా బీజేపీ అధ్యక్షురాలి చల్లా శ్రీలత రెడ్డి అధ్యక్షతన ఈ నియామకం జరిగింది. ఈ సందర్భంగా నియామక పత్రాన్ని అందుకున్న చిత్తలూరి సోమయ్య గౌడ్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో ఈ అపారమైన బాధ్యతను అప్పగించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు కి, జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు కంచర్ల నరసింహారెడ్డి కి, జిల్లా అధ్యక్షురాలికి చల్ల శ్రీలత రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఈ నియామకానికి పూర్తి సహకారం అందించిన మాజీ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి కి, బొబ్బ భాగ్యరెడ్డి కి , పార్టీ పెద్దలందరికీ ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. సూర్యాపేట జిల్లాలోని అన్నదాతల సమస్యలపై క్షేత్రస్థాయిలో నిరంతరం పోరాడతానని హామీ ఇచ్చారు. ఈ నియామకం పట్ల జిల్లా వ్యాప్తంగా ఉన్న బీజేపీ నాయకులు, కార్యకర్తలు మరియు గరిడేపల్లి మండల యువత హర్షం వ్యక్తం చేస్తూ సోమయ్య గౌడ్ కి శుభాకాంక్షలు తెలిపారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి

* చౌరస్తా లో బీజేవైఎం నిరసన.. రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దగ్ధం



జనగామ, ప్రజాస్ఫూర్తి : పెండింగ్ లో ఉన్న రూ.15 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ జనగామ పట్టణంలో బీజేవైఎం ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ ను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా బీజే వైఎం జిల్లా అధ్యక్షుడు ఎల్లబోయిన హరీష్ మాట్లాడుతూ.. తెలంగాణలో సుమారు 40 లక్షల మంది పేద విద్యా ర్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకంపై ఆధారపడి ఉన్నారని తెలిపారు. ప్రభు త్వం ఇప్పటివరకు పెండింగ్‌లో ఉన్న బకాయిలను విడుదల చేయకపోవడం వల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. వి ద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్ షిప్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బీజేవైఎం ఆధ్వర్యంలో ఆం దోళనలను మరింత ఉధృతం చేస్తామ ని హెచ్చరించారు.

## నస్తీపూర్‌లో ఘనంగా రాఖీ సంబరాలు



సంగారెడ్డి జిల్లా హత్నూర , (ప్రజాస్ఫూర్తి ) హత్నూర మండలంలోని నస్తీపూర్ గ్రామ ప్రాథమిక పాఠశాలలో శ్రావణ పౌర్ణమిని పురస్కరించుకుని గురువారం రాఖీ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు లోకనాధం మాట్లాడుతూ.. అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా రాఖీ పండుగను జరుపుకుంటామని తెలిపారు. ప్రతి ఆడపిల్లకు మగవారు రక్షణగా ఉండాలనే సంకల్పంతో విద్యార్థులందరికీ రాఖీలు కట్టించినట్లు చెప్పారు. చిన్ననాటి నుంచే విద్యార్థుల్లో మహిళల పట్ల గౌరవ భావం, మన సంస్కృతి సంప్రదాయాల పట్ల అవగాహన పెంపొందించడమే కార్యక్రమం ఉద్దేశమన్నారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు లోకనాధం, ఉపాధ్యాయులు నరేష్, వాలంటీర్ ప్రవళిక, విద్యార్థులు పాల్గొన్నారు.

## 22 ఎ ఎక్స్ టెంట్ లో తేడాలు వస్తే వాటిని భూభారతి పోర్టల్ లోనే పరిష్కరించాలి

* భూభారతిపై వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ లు



ప్రజాస్ఫూర్తి , భైంసా : రాష్ట్రంలోని భూభారతి, 22ఏ, సమగ్ర రిసర్వే చేసేందుకు నిర్దేశించిన అంశాల పై గురువారం రాష్ట్ర రెవెన్యూ కార్యదర్శి లోకేష్ కుమార్ జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో భాగంగా రెవెన్యూ కార్యదర్శి లోకేష్ కుమార్ మాట్లాడుతూ, భూభారతి డాటా ఆధారంగా ఎక్కడైనా 22 ఎ ఎక్స్ టెంట్ లో తేడాలు వస్తే వాటిని భూభారతి పోర్టల్ లోనే పరిష్కరించాలని సూచించారు. వ్యవసాయ, వ్యవసాయేతర భూముల్లో 22 ఎ కింద నమోదు అయినట్లు ఉంటే వాటిని గుర్తించి, నిర్ణీత ప్రొఫార్మాలో తహసిల్దార్ ల నుంచి సేకరించి నివేదిక సమర్పించాలని పేర్కొన్నారు. ఇందుకోసం స్టాండర్డ్ ఆపరేషన్ సిస్టం అమలు చేయాలని తెలియజేశారు. ఎస్ ఆర్ ఓ లో వచ్చిన ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి మండలంలో ఒక గ్రామాన్ని ఎంచుకొని ఆ గ్రామంలో సమగ్రంగా భూ రీసర్వే నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని వాటి సత్ఫలితాలు ఆధారంగా అన్ని గ్రామాల్లో రీసర్వే చేయాల్సి ఉంటుందని తెలియజేశారు. భైంసా సబ్ కలెక్టర్ కార్యాలయం నుంచి ఈ వీసీలో జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, భైంసా సబ్ కలెక్టర్ అజ్మరా సంకేత్ కుమార్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## భద్రతా పరంగా పటిష్ఠ చర్యలు చేపట్టాలి

* జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ జైలు సూపరింటెండెంట్‌కు సూచనలు.



ప్రజాస్ఫూర్తి , నల్లగొండ : భద్రతా పరంగా పటిష్ఠ చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ జైలు సూపరింటెండెంట్‌కు సూచనలు చేశారు. గురువారం నల్లగొండ జిల్లా జైలును నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ సందర్శించి జైలు భద్రతా ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. జైలు సూపరింటెండెంట్‌తో కలిసి జైలు పరిసరాలు, భద్రతా విధానాలు, సెక్యూరిటీ పాయింట్లు, ప్రవేశ-నిష్క్రమణ ప్రాంతాలను పరిశీలించి, భద్రతాపరంగా తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై సమగ్రంగా సమీక్షించారు.ఈ సందర్భంగా జైలు భద్రతకు సంబంధించి సెక్యూరిటీ పాయింట్ ఆఫ్ వ్యూలో అవసరమైన సూచనలు, సలహాలను జైలు సూపరింటెండెంట్‌కు జిల్లా ఎస్పీ అందజేశారు. జైలు పరిసరాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సెక్యూరిటీ పాయింట్ల వద్ద సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని, భద్రతా ప్రమాణాల విషయంలో ఎలాంటి అలసత్వానికి తావులేకుండా చూడాలని తెలిపారు.అనుకోని పరిస్థితులు ఎదురైనప్పుడు వెంటనే స్పందించే విధంగా ముందస్తు కార్యాచరణ సిద్ధంగా ఉంచుకోవాలని జిల్లా ఎస్పీ సూచించారు.జైలు భద్రత విషయంలో పోలీసు శాఖ, జైలు శాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా ఎస్పీ పేర్కొన్నారు. పరస్పరం సమాచారాన్ని పంచుకుంటూ, సమన్వయంతో పనిచేయడం ద్వారా జైలు భద్రతను మరింత బలోపేతం చేయాలని సూచించారు..ఈ సందర్భనలో జైలు సూపరింటెండెంట్, జైలు అధికారులు, సిబ్బంది మరియు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## కుంటాల కు కొత్త అందాలు..! రూ. 35కోట్లతో అభివృద్ధి పనులు

* రిసార్ట్స్ , ఓపెన్ స్విమ్మింగ్ పూల్ కోసం సాగుతున్న పనులు వేగవంతం పై కలెక్టర్ ప్రత్యేక దృష్టి



ఆదిలాబాద్ జిల్లా, ప్రజాస్ఫూర్తి : అడవి తల్లి ఒడిలో అందాల సోయగాలతో రాష్ట్రంలోనే ఎత్తైన జలపాతంగా పేరొందిన కుంటాల జలపాతానికి కొత్త అందాలు తోడుకన్నాయి. అడవి తల్లి అందాలకు తోడు పర్యాటకులకు సౌకర్యాలు అందుబాటులోరానన్నాయి. రిసార్ట్స్ వంటి నిర్మాణాలు పూర్తి అయితే ఇక్కడ బస చేయొచ్చు. ప్రకృతి ఒడిలోనే బస చేసే అవకాశం ఉంటే, దూర ప్రాంతాల నుంచి వచ్చిన రిసార్ట్స్ లో బస చేసే అవకాశం అందుబాటులోకి వస్తే పర్యాటకుల సంఖ్య పెరుగుతుంది. అందుబాటులోకి రిసార్ట్స్... కుంటాల పర్యాటకంగా అభివృద్ధి చెందాలంటే ఇక్కడ రిసార్ట్స్, ఓపెన్ స్విమ్మింగ్ పూల్, బోటింగ్ ఏర్పాటు చేయాలని పర్యాటకశాఖ గతంలో ప్రతిపాదనలు పంపింది. గత పాలకుల నిర్లక్ష్యం వల్ల ఇవి ముందుకు సాగలేదు. ప్రస్తుత ప్రభుత్వం వీటిపై సై అనడంతో పనులు చకచగా సాగుతున్నాయి. రూ. 3.5 కోట్లతో జలపాతం ఆవరణలో రిసార్ట్స్, ఓపెన్ స్టేజ్, ఓపెన్ స్విమ్మింగ్ పూల్ లతోపాటు బోటింగ్ లను ఏర్పాటు చేసేందుకు అధికారులు టెండర్లు పిలిచారు. ఈ మేరకు పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ పనులను కొనసాగిస్తున్నారు. ఇప్పటికే జలపాతం పై భాగంలో రిసార్ట్స్ పనులు 90% పూర్తయ్యాయి. త్వరలోనే వీటిని పర్యాటకులకు అందుబాటులోకి తీసుకొస్తామని అధికారులు చెబుతున్నారు. కలెక్టర్ ప్రత్యేక దృష్టి... ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షిషా పర్యాటక ప్రాంతాల అభివృద్ధి పై ప్రత్యేక దృష్టి సారించి పనులను ఎప్పటికప్పుడు స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. ఇటీవలే కుంటాల జలపాతం వద్ద నిర్మాణం లో ఉన్న పనులను పరిశీలించి, సాధ్యమైనంత తొందరగా భవనాలను పర్యాటకు అందుబాటులోకి తీసువచ్చేలా చూడాలని ఈ మేరకు పర్యాటక శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

## పార్టీని బలోపేతం చేసేందుకు ఐక్యంగా ముందుకు సాగాలి

* ముస్తాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గజ్జెల రాజు

ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: పార్టీని మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా ముందుకు సాగాలని ముస్తాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గజ్జెల రాజు తెలిపారు. నూతనంగా ఎన్నికైన ముస్తాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ కమిటీకి గురువారం ఆయన హృదయపూర్వక అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా గజ్జెల రాజు మాట్లాడుతూ ప్రభుత్వ విప్ వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్, సిరిసిల్ల నియోజకవర్గ ఇన్చార్జి కేకే మహేందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు సంగీతం శ్రీను నాయకత్వాన్ని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. నిరంతరం ప్రజా సమస్యలపై పోరాటం చేస్తూ కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని సూచించారు. నూతన బాధ్యతలు చేపట్టిన సభ్యులు కొత్త ఉత్సాహంతో పనిచేసి పార్టీ విజయం కోసం కృషి చేయాలని ఆకాంక్షించారు.

## వన మహోత్సవ లక్ష్యాలను త్వరగా పూర్తి చేయాలి : కలెక్టర్ కె.హరిత



కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా,ప్రజా స్ఫూర్తి: వన మహోత్సవంలో భాగంగా జిల్లాకు నిర్దేశించిన మొక్కల నాటే లక్ష్యాలను అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ కె.హరిత ఆదేశించారు.పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. గురువారం జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వన మహోత్సవ కార్యక్రమంలో కలెక్టర్, అదనపు కలెక్టర్లు యువరాజ్ మర్మాట్, ఎం.డేవిడ్, జిల్లా రెవెన్యూ అధికారి దాసరి వేణుతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాకు కేటాయించిన వన మహోత్సవ లక్ష్యాలను నిర్ణీత సమయంలోగా పూర్తి చేసేందుకు శాఖల వారీగా సమన్వయంతో చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రభుత్వ భూములు, ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలు, విద్యాసంస్థలు, కాలువలు, చెరువుల గట్లు, రహదారుల ఇరువైపులా అనువైన మొక్కలను పెద్దఎత్తున నాటాలని అధికారులను ఆదేశించారు. మొక్కలు నాటడంతోనే కార్యక్రమం పూర్తయినట్లు కాకుండా వాటి సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రతి మొక్కను సంరక్షించి భవిష్యత్‌లో పచ్చదనాన్ని పెంపొందించేలా చర్యలు చేపట్టాలని సూచించారు.

**ప్రజల భాగస్వామ్యం కీలకం**

వన మహోత్సవంలో ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు, విద్యార్థులు, వివిధ వర్గాల ప్రజలు స్వచ్ఛందంగా భాగస్వాములై మొక్కలు నాటాలని కలెక్టర్ కోరారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, పచ్చదనం పెంపొందించడం ద్వారా భావితరాలకు మెరుగైన వాతావరణాన్ని అందించవచ్చని తెలిపారు.కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి దత్తారావు, జిల్లా పంచాయతీ అధికారి బిక్షపతి, సంబంధిత శాఖల అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఫీజు రీయింబర్స్మెంట్ 1500 కోట్లు విడుదల చేయాలి....

* రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దగ్ధం చేసిన బీజేవైఎం నాయకులు....



ప్రజాస్ఫూర్తి, మెదక్ టౌన్ : ఫీజు రీయంబర్స్మెంట్ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ మెదక్ పట్టణంలోని రాందాస్ చౌరస్తా వద్ద బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో బీజేవైఎం నాయకులు రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా బిజెపి జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ మల్లేశం గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యార్థులు ఫీజు రీఎంబర్స్మెంట్లు పెండింగ్లో ఉండడంతో తీవ్ర ఇబ్బందులకు ఎదుర్కొంటున్నారన్నారు. యాజమాన్యాల సర్టిఫికెట్లను తీసుకోలేని పరిస్థితిలో విద్యార్థులు ఉన్నారని, విద్యార్థుల సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పెండింగ్లో ఉన్న 1500 కోట్ల రూపాయలు వెంటనే వీడియోలు చేసి విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలని వారి డిమాండ్ చేశారు. పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయకపోతే బిజెపి, బీజేవైఎం ఆధ్వర్యంలో పోరాటాన్ని ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రంజిత్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు నాయిని ప్రసాద్, రాజు యువ మోర్చా పట్టణ అధ్యక్షుడు బాబ్లు, బిజెపి బీజేవైఎం నాయకులు సన్నీ, సాయి, సాయి బాబా, ప్రవీణ్, నర్సింగ్, నవీన్, సాయి జగదీష్ సాయి కిరణ్, తదితరులు పాల్గొన్నారు

## రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



ప్రజాస్ఫూర్తి , జన్నారం: మండల కేంద్రంలో జరిగిన రెడ్డి సంక్షేమ సంఘం సమావేశంలో, రెడ్ల సంక్షేమానికి సంబంధించిన పలు అంశాలపై గురువారం సమావేశానికి హాజరైన రెడ్డి బంధువులు చర్చించుకున్నారు. ముఖ్యంగా రెడ్డి కార్పొరేషన్ ను వెంటనే ప్రకటించాలని సంఘం నాయకులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సంఘం జిల్లా అధ్యక్షులు గుర్రం మోహన్ రెడ్డి మాట్లాడుతూ రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేసి రెడ్డి సామాజికవర్గం లో ఉన్న పేద వారైనా రెడ్ల కు ఉపాధి ,ఆర్థికంగా మరియు వ్యవసాయ రంగంలో వారిని ఆదుకోవడానికి రెడ్డి కార్పొరేషన్ ఎంతో ఉపయోగపడుతుందని ఈ విషయంలో ప్రభుత్వం వెంటనే స్పందించి రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి ఈ విషయములో వెంటనే స్పందించి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల గౌరవ అధ్యక్షులు ఏనుగు సుభాష్ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు సామ ప్రభాకర్ రెడ్డి , ఇతర రెడ్డి బంధువులు పాల్గొన్నారు.

## లోత్రోర్రే గ్రామంలో వైద్య శిబిరం



ప్రజాస్ఫూర్తి ,జన్నారం: జన్నారం మండలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఉమా శ్రీ ఆదేశానుసారం జన్నారం మండలంలోని మారుమూల గ్రామమైన లోత్రోర్రే గ్రామంలో గురువారం రోజున వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామస్తులకు రాపిడ్ టెస్టులు మరియు రక్తపూతలు ( బ్లడ్ క్లియర్ టెస్టులు) చేసి మందుల ను పంపిణీ చేశారు. ఇందులో భాగంగా డ్రై డే కార్యక్రమం నిర్వహించి సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించి మరియు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ లక్ష్మి హెల్త్ అసిస్టెంట్లు పోచయ్య, కమలాకర్, ఏఎన్ఎం ప్రియాంక ఆశా కార్యకర్త లీల ,అంగన్వాడి టీచర్ కవిత గ్రామపంచాయతీ సిబ్బంది , గ్రామస్తులు పాల్గొన్నారు.

## వేధింపులకు గురైతే షీ టీమ్ నంబర్‌కు ఫిర్యాదు చేయాలి

* **షీ టీమ్ బృందం అధికారులు**




ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: వేధింపులకు గురైతే వెంటనే నిర్భయంగా షీ టీమ్ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని షీ టీమ్ అధికారులు తెలిపారు. గురువారం ముస్తాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆవునూరు గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా షీ టీమ్ అధికారులు మాట్లాడుతూ విద్యార్థులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్, పోక్సో చట్టం, సోషల్ మీడియా వినియోగం, మోసాలు మరియు మహిళా చట్టాలపై స్పష్టమైన అవగాహన కల్పించారు. వేధింపులకు పాల్పడే నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని, ఫిర్యాదు చేసిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో అపరిచిత వ్యక్తులకు స్పందించకూడదని, గుర్తు తెలియని వ్యక్తులతో వ్యక్తిగత సమాచారం పంచుకోవద్దని విద్యార్థులకు సూచించారు. జిల్లాల్లో విద్యార్థుల భద్రతను బలోపేతం చేయడమే లక్ష్యంగా విద్యాసంస్థల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో షీ టీమ్ ఏ ఎస్ ఐలు ప్రమీల, రవి, సిబ్బంది శ్రీలత, ప్రియాంక, శ్రీనివాస్‌తో పాటు పాఠశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అన్నా చెల్లెళ్ల ప్రేమానుబంధానికి ప్రతీకగా రాఖీ పౌర్ణమి

* **ఠాగూర్స్ హై స్కూల్ కరస్పాండెంట్ బండారి సాయి కుమార్**



జగద్గిరిగుట్ట, ప్రజాస్ఫూర్తి : అన్నా చెల్లెళ్ల ప్రేమానుబంధానికి ప్రతీకగా రాఖీ పౌర్ణమి పండుగ జరుపుకుంటామని ఠాగూర్స్ హై స్కూల్ కరస్పాండెంట్ బండారి సాయి కుమార్ అన్నారు. శ్రావణ పౌర్ణమిని పురస్కరించుకుని గురువారం రంగారెడ్డి నగర్ డివిజన్ గాంధీనగర్ లోని ఠాగూర్స్ హై స్కూల్లో రాఖీ పౌర్ణమి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ముందుగా తులసీ చెట్టుకు పూజ చేసి రాఖీ కట్టారు. అనంతరం ఒకరినొకరు రక్షణగా ఉండాలని విద్యార్థిని విద్యార్థులు రాఖీలు కట్టారు. ఈ సందర్భంగా బండారి సాయి కుమార్ మాట్లాడుతూ రాఖీ పౌర్ణమి అనేది భారతదేశంలో ఎంతో ప్రాముఖ్యత కలిగిన పండుగ. ఇది అన్నా చెల్లెళ్ల బంధాన్ని ప్రతిబింబించే పండుగగా ప్రసిద్ధి చెందిందన్నారు. అన్నా చెల్లెళ్ల మధ్య ఉన్న అనురాగాన్ని మరింత బలపరచడానికి ఉపయోగపడుతుందన్నారు. చిన్ననాటి నుంచే విద్యార్థుల్లో మహిళల పట్ల గౌరవ భావం, మన సంస్కృతి సంప్రదాయాల పట్ల అవగాహన పెంపొందించడమే కార్యక్రమం ఉద్దేశమన్నారు. వెలుగు ఎడ్యుకేషనల్ ట్రస్టు వ్యవస్థాపకులు ఇక్కుర్తి నారాయణ రావు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం శ్రావణ శుద్ధ పౌర్ణమి రోజున రాఖీ పండుగను జరుపుకుంటామన్నారు. అక్క చెల్లెలు తన అన్నదమ్ములకు రాఖీ కట్టి, వారి సుఖ సంతోషాలను కోరుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా రాఖీ పౌర్ణమి వేడుకలు

* **జర్నలిస్టులకు రాఖీలు కట్టిన మహబూబాబాద్ రూరల్ సీఐ అంజలి**



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : మహబూబాబాద్ పట్టణ కేంద్రంలోని నెహ్రూ సెంటర్లో వర్కింగ్ జర్నలిస్ట్స్ ఆఫ్ ఇండియా (డబ్ల్యూ జే ఐ) ఆధ్వర్యంలో రాఖీ పండుగ వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మహబూబాబాద్ రూరల్ సీఐ అంజలి పాల్గొన్నారు.ఈ సందర్భంగా రూరల్ సీఐ అంజలి జర్నలిస్టులందరికీ తన చేతుల మీదుగా రాఖీలు కట్టి,పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.సిఐ మాట్లాడుతూ సమాజ శ్రేయస్సు కోసం,ప్రజల సమస్యలను వెలుగులోకి తెచ్చేందుకు నిరంతరం శ్రమించే జర్నలిస్టు సోదరులకు రక్షణగా ఈ రక్షాబంధన్ వేడుకను నిర్వహించడం సంతోషకరమని ఆమె అన్నారు. అనంతరం డబ్ల్యు జే ఐ ప్రతినిధులు మాట్లాడుతూ ప్రతి ఏటా సోదరభావానికి ప్రతీకగా నిలిచే రాఖీ పండుగను జర్నలిస్టులందరి సమక్షంలో, సీఐ చేతుల మీదుగా జరుపుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు.ఈ కార్యక్రమంలో (డబ్ల్యూ జే ఐ) వర్కింగ్ జర్నలిస్ట్ ఆఫ్ ఇండియా మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు హనుమాండ్ల రామకృష్ణారెడ్డి, జిల్లా కార్యదర్శి అంబాల కుమార్,జిల్లా కోశాధికారి రాసగొల్ల సత్యనారాయణ,జిల్లా కో కన్వీనర్లు పల్లె శ్రీనివాస్ గౌడ్, దొంత పురుషోత్తం, తక్కలపల్లి శ్రీనివాస్,ఇరుకుల్ల శివరామకృష్ణ,కొండి సాయి కిరణ్,హెచ్ ప్రవీణ్,అంగోత్ లక్ష్మణ్,అలకుంట్ల శ్రీనివాస్,ఈనాడు విలేఖరి రామనర్సయ్య,ఎస్ఐలు అరుణ్ కుమార్, సూరయ్య,వర్కింగ్ జర్నలిస్టులు,పాత్రికేయులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకను విజయవంతం చేశారు.

## మహా ధర్నాకు కదిలి వచ్చిన ఉపాధ్యాయ, ఉద్యోగ, పెన్షనర్ల లోకం




ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: తెలంగాణ రాష్ట్ర, ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్ల ఐక్యవేదిక రాష్ట్ర కమిటీ ఇచ్చిన దశల వారి పోరాటంలో భాగంగా గురువారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో మహా ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా కార్యక్రమానికి టీఎస్జీవోస్ యూనియన్ జిల్లా కార్యదర్శి దున్న శ్యామ్ అధ్యక్షత వహించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ఉద్యోగులు ఉపాధ్యాయులు పెన్షనర్ల సంఘాల నాయకులు కార్యకర్తలు వేలాదిగా ధర్నాలో పాల్గొన్నారు. తమ సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. పిఆర్ సిఅమలు చేయాలి, పెండింగ్ లో ఉన్న 6 డిఎ లను మంజూరు చేయాలన్నారు.

* **సిపిఎస్ రద్దుచేసి ఒపిఎస్ పునర్ధరించాలి**

హెల్త్ కార్డులు సక్రమంగా అమలు చేయాలని విబ్ జి రామ్ జి అన్నారు. ఉపాధ్యాయుల బదిలీలు చేపట్టి, పదోన్నతులు పూర్తి చేయాలన్నారు. జీవో 25 సవరణ చేయాలని, జీవో 190 అమలు చేయాలన్నారు. ఉద్యోగులకు ప్రకటించిన పే స్కేల్స్ లను అమలు పరచాలి.. ఇతర సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి జె ఎసి నాయకత్వాన్ని ఆహ్వానించి సమస్యల పరిష్కారం కోసం చొరవ తీసుకోవాలని డిమాండ్ చేస్తూ, సెప్టెంబర్ 10వ తేదీన ఇందిరాపార్క్ వద్ద జరగనున్న మహాధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు భూపాల్ రెడ్డి,తంగేళ్ల జితేందర్ రెడ్డి,రాధాకృష్ణ, ఎన్ సోంబాబు, పి వీరన్న, షేక్ ఉమర్, నిమ్మల శ్రీనివాస్, సీతారామయ్య, నాగేశ్వరరావు, మన్నెం యాదగిరి, బి పాండు నాయక్, కోడి రెక్క నాగేందర్, లక్కపాక ప్రవీణ్ కుమార్, ఎస్ రవికుమార్, నాయిని ఆకాష్ వర్మ, మడి పడగ సైదులు, డి.బాలు నాయక్, బంధం వెంకటేశ్వర్లు, సుంకరి అనిత, పద్మావతి, వెంకటరమణ, పి శ్రీనివాస్ రెడ్డి, రామకృష్ణారెడ్డి, శ్రీరాములు, నాగయ్య, పంచాయతీ కార్యదర్శుల సంఘం ఇంద్ర బాబు, శ్రీకాంత్ రెడ్డి జిల్లా పరిషత్తు ఉద్యోగుల సంఘం శ్రీధర్ నాయుడు అయోధ్య, భూపతి వెంకటయ్య, డాక్టర్ బట్టు గోపి, రేపక లింగన్న, పబ్బతి వెంకటేశ్వర్లు, మర్యాద సైదులు తదితర ఉద్యోగ సంఘ నాయకులు పాల్గొని ధర్నాని విజయవంతం చేశారు

## యువతను విస్మరిస్తే పాలకులకు పతనం తప్పదు

* **ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వలి ఉల్లాఖాద్రి**



ప్రజాస్ఫూర్తి , కొత్తగూడెం : భద్రాద్రి కొత్తగూడెం ఏఐవైఎఫ్ జిల్లా నిర్మాణ మహాసభ గురువారం పట్టణంలోని సిపిఐ జిల్లా కార్యాలయం 'శేషగిరి భవన్'లో ఘనంగా నిర్వహించారు. సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి నానబాల బాలకృష్ణ జెండాను ఆవిష్కరించి సభలను ప్రారంభించారు. అనంతరం జరిగిన ప్రతినిధుల సభలో రాష్ట్ర అధ్యక్షులు వలిఉల్లాఖాద్రి పాల్గొని ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాల వల్ల దేశంలో నిరుద్యోగ సమస్య తీవ్రరూపం దాల్చిందన్నారు. ఏటా కోట్లాది ఉద్యోగాలు ఇస్తామని గద్దెనెక్కిన పాలకులు యువశక్తిని పూర్తిగా విస్మరిస్తూ మోసం చేస్తున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పార్టీ జిల్లా కార్యదర్శి ఎస్ .కే. సాబీర్ పాషా, మేయర్ మూడ్ గణేష్ , కల్లూరి వెంకటేశ్వరరావు, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు ఇటికల రామకృష్ణ, నాయకులు సలిగంటి శ్రీనివాస్, మున్నా లక్ష్మీకుమారి, పూర్ణచందర్ రావు, తదితరులు పాల్గొన్నారు .

## ఘనంగా ఖేలో ఇండియా డైలాగ్ – ఖేల్ కీ బాత్ పీఎం మోదీ కే సాత్ తో కార్యక్రమం




ప్రజాస్ఫూర్తి, భైంసా: జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా దేశంలోని క్రీడాకారులు, యువత, విద్యార్థులతో భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రత్యక్షంగా సంభాషించే "ఖేలో ఇండియా డైలాగ్ - ఖేల్ కీ బాత్ పీఎం మోదీ కే సాత్ తో" ప్రత్యేక కార్యక్రమాన్ని గోపాల్ రావ్ పాటిల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, భైంసాలో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశవ్యాప్తంగా ఉన్న యువ అథ్లెట్లు, యువత, యువ నాయకులు, విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. దేశవ్యాప్తంగా సుమారు 1,500కు పైగా విద్యాసంస్థల్లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో లక్షలాది మంది యువతీ యువకులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ప్రధానమంత్రి మోదీ క్రీడలకు దేశాభివృద్ధిలో ఉన్న ప్రాధాన్యతను వివరించారు.యువత చదువుతో పాటు క్రీడల్లో కూడా చురుగ్గా పాల్గొని శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. క్రీడా రంగంలో ప్రతిభను ప్రోత్సహించడం ద్వారా భారతదేశాన్ని ప్రపంచ క్రీడా శక్తిగా తీర్చిదిద్దవచ్చని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన అందించిన "జో ఖేలేగా,వో ఖిలేగా" —— "ఆడేవాడే ఆనందంగా వికసిస్తాడు అనే సందేశం యువతలో క్రీడల పట్ల మరింత స్ఫూర్తిని నింపింది.నిర్మల్ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కళాశాల ప్రిన్సిపాల్ కర్రోల్ల బుచ్చయ్య ఇంచార్జి ప్రిన్సిపాల్ డా.కె. రఘునాథ్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ల డా జే. ఓంప్రకాష్, డా. మహేదా, ఫిజికల్ డైరెక్టర్ డా. సంతోష్ కంప్యూటర్ లెక్చరర్ దివ్య సమన్వయంతో కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.ఈ కార్యక్రమం మేర యువ వాలంటీర్స్ సంఘం నర్సయ్య,సూర్యవంశీ రాజేశ్వర పటేల్ వాలంటీర్స్ కు విద్యార్థులకు వివిధ కీలకమైన అంశాలపై సూచనలు చేశారు.విద్యార్థుల్లో క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించడంతో పాటు, ప్రధానమంత్రి సందేశాన్ని నేరుగా వినే అరుదైన అవకాశాన్ని కల్పించిందని కళాశాల అధ్యాపకులు డా భీమారావు, డా. పవన్ కుమార్, డా. రవి కుమార్, ఆరే. రాజు, శ్రవణ్య, డా, కల్పన, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థులు తెలిపారు.

## 40 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత

* **ఇద్దరు డ్రైవర్ల అరెస్ట్.. కేసు నమోదు**

పాలకుర్తి/జనగామ, ప్రజాస్ఫూర్తి : జిల్లాలోని పాలకుర్తి మండలంలో పోలీసులు నిర్వహించిన వాహన తనిఖీల్లో భారీగా పీడీఎస్ బియ్యం పట్టుబడ్డాయి. నమ్మదగిన సమాచారం మేరకు గురువారం తెల్లవారుజామున పాలకుర్తి ఎస్ఐ, సిబ్బంది వాహన తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో రెండు వేర్వేరు వాహనాల్లో అక్రమంగా తరలిస్తున్న సుమారు 40 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా రాజుపేటకు చెందిన మాలోతు మోహన్ నడుపుతున్న అశోక్ లేలాండ్ వాహనంలో 30 క్వింటాళ్ల బియ్యం, తుర్కపల్లికి చెందిన భూక్యా నామా నడుపుతున్న మరో వాహనంలో 10 క్వింటాళ్ల బియ్యాన్ని అధికారులు గుర్తించారు. గ్రామస్థుల నుంచి తక్కువ ధరకు రేషన్ బియ్యాన్ని సేకరించి అక్రమంగా తరలిస్తున్నట్లు ప్రాథమిక విచారణలో తేలిందని పోలీసులు తెలిపారు.ఇద్దరు డ్రైవర్లను అరెస్ట్ చేసి, బియ్యం తరలింపులో ఉపయోగించిన వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఘటన పై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

## అఖిలభారత యువజన సమాఖ్య రాష్ట్ర మూడవ మహాసభలను జయప్రదం చేయాలి




ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: యాదాద్రి భువనగిరి జిల్లాలో జరగనున్న అఖిల భారత యువజన సమాఖ్య తెలంగాణ రాష్ట్ర మూడవ మహాసభలను జయప్రదం చేయాలని సిపిఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. గురువారం జిల్లా కేంద్రంలో అఖిల భారత యువజన సమాఖ్య పట్టణ కౌన్సిల్ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని, యువత ఎదుర్కొంటున్న నిరుద్యోగం, ఉపాధి అవకాశాల కొరత, విద్యా సమస్యలు, ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ, సామాజిక న్యాయం, యువత హక్కులు వంటి అనేక సమస్యలపై మహాసభల్లో సమగ్రంగా చర్చించి భవిష్యత్ ఉద్యమ కార్యాచరణను రూపొందించనున్నట్లు తెలిపారు.ఈ సమావేశం కుక్కడపు శౌరి అధ్యక్షతన జరిగిన సమావేశంలో అఖిల భారత యువజన సమాఖ్య పట్టణ అధ్యక్ష కార్యదర్శిలు బూర సైదులు, ఎడెల్లి శ్రీకాంత్ , కామేష్, రెడిమల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## నో మ్యాపింగ్, లాజికల్ డిస్క్రెపెన్సీలను సరిచేసుకోవాలి

* **మున్సిపల్ వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్**




ప్రజాస్ఫూర్తి, మెదక్ జిల్లా: ఓటరు జాబితాలోని వివరాల పరిశీలన, సవరణల అంశాలపై మెదక్ పట్టణంలోని నవాబ్ పేట్ లో 14, 15 వార్డుల్లో నిర్వహించిన అవగాహన కార్యక్రమం లో మున్సిపల్ వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్, కౌన్సిలర్ దొంతి లక్ష్మి పాల్గొన్నారు. మ్యాపింగ్ 2002 లేని ఓటర్ వివరాలు డాక్యుమెంట్ సమర్పించాలని మున్సిపల్ వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్ సమక్షంలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన అర్హులైన కొత్త ఓటర్లు తమ పేర్లను నమోదు చేసుకునేందుకు ఫారం-6 సమర్పించాలని వారు సూచించారు. అలాగే ఓటరు జాబితాలో పేరు, వయస్సు, చిరునామా, ఫోటో, బంధుత్వం తదితర వివరాల్లో సవరణలు అవసరమైతే ఫారం-8 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ప్రజలు, బిఎల్ఓ లు, బిఎల్ఏ లు, సంబంధిత అధికారులు ఓటరు జాబితాను పరిశీలించి అర్హులైన ప్రతి ఒక్కరూ తమ వివరాలను సరిచేసుకుని నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జీపీవో స్వామి, జూనియర్ అసిస్టెంట్ ప్రకాష్, బిఎల్ ఓ లు జబిన ఫాతిమా, బుచ్చమ్మ, నీలిమ పాల్గొన్నారు.

## ఏసీబీ వలలో మైన్స్ ఏడీ.. కార్యాలయం, నివాసాల్లో ఏకకాలంలో సోదాలు



భూపాలపల్లి టౌన్, (ప్రజా స్ఫూర్తి): జయశంకర్ భూపాలపల్లి జిల్లా మైన్స్ ఏడీ సహాయ సంచాలకుడు బొజ్జ జయరాజ్‌పై అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) గురువారం కొరడా ఝుళిపించింది. ఇసుక అక్రమ రవాణాకు సంబంధించి వచ్చిన ఆరోపణల నేపథ్యంలో వరంగల్ ఏసీబీ డీఎస్పీ సాంబయ్య ఆధ్వర్యంలో అధికారులు ఏకకాలంలో సోదాలు చేపట్టారు. జిల్లా కలెక్టరేట్‌లోని మైన్స్ ఏడీ కార్యాలయంతో పాటు జయరాజ్‌కు సంబంధించిన నివాసాల్లోనూ తనిఖీలు నిర్వహించారు. ఉదయం నుంచి కొనసాగుతున్న ఈ సోదాల్లో కీలకమైన పత్రాలు, ఇతర ఆధారాల కోసం ఏసీబీ అధికారులు ఆరా తీస్తున్నట్లు తెలుస్తుంది. సోదాలు పూర్తయిన అనంతరం ఏ మేరకు ఆస్తులు, నగదు లేదా ఇతర ఆధారాలు లభించాయన్నది స్పష్టమయ్యే అవకాశం ఉంది. అయితే ఏసీబీ అధికారుల నుంచి పూర్తి వివరాలు అధికారికంగా వెల్లడికావాల్సి ఉంది.

**ప్రశంసా పత్రం అందుకున్న కొద్దిరోజులకే..**

ఇటీవల జరిగిన 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఉత్తమ అధికారిగా మైన్స్ ఏడీ జయరాజ్ ప్రశంసా పత్రం అందుకున్నారు. ఉత్తమ అధికారిగా గుర్తింపు పొందిన కొద్దిరోజులకే ఆయనపై ఏసీబీ సోదాలు జరగడం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. ఏసీబీ తనిఖీలు పూర్తయిన తర్వాత వెలువడే అధికారిక వివరాలపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

# ఉద్యోగుల భవిష్యత్తుకు భరోసానిచ్చే పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి

*** పంచాయతీ కార్యదర్శుల ఫోరం జిల్లా అధ్యక్షులు గోదారి అజయ్ డిమాండ్...**

చిగురుమామిడి, ప్రజాస్ఫూర్తి : కరీంనగర్ జిల్లా పంచాయతీరాజ్ విభాగం ఆధ్వర్యంలో చేపట్టిన ఉద్యోగుల మహాధర్నా కార్యక్రమం విజయవంతమైనట్లు పంచాయతీ కార్యదర్శుల ఫోరం జిల్లా అధ్యక్షులు గోదారి అజయ్ కుమార్ తెలిపారు.జిల్లా అధ్యక్షులు గోదారి అజయ్ కుమార్ చిగురుమామిడి మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కరీంనగర్ జిల్లా జేఏసీ అధ్యక్షులు దారం శ్రీనివాస్ రెడ్డి,సెక్రెటరీ కాల్ చరణ్ ల నేతృత్వంలో ఉద్యోగులు తమ న్యాయమైన డిమాండ్ల సాధనకై ఈ నిరసన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు చెప్పారు. రాష్ట్ర అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తున్న పంచాయతీరాజ్ ఉద్యోగుల సమస్యలు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉండటం అత్యంత బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నోసార్లు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లినా,వినతి పత్రాలు సమర్పించినా,చర్చలు జరిపినా ఫలితం లేకుండా పోయిందని మండిపడ్డారు. పెండింగ్‌లో ఉన్న 6డీఏలను వెంటనే విడుదల చేయాలని,ఉద్యోగుల భవిష్యత్తుకు భరోసానిచ్చే పాత పెన్షన్ విధానాన్ని మరలా పునరుద్ధరించాలని,ఉద్యోగులకు ఆరోగ్య భద్రత కల్పిస్తూ,హెల్త్ కార్డులను వెంటనే జారీ చేయాలన్నారు.ఈ మహాధర్నా కార్యక్రమానికి కరీంనగర్ జిల్లా పంచాయతీ ఉద్యోగుల నుంచి భారీ స్పందన లభించింది.జిల్లా పంచాయతీ అధికారి జగదీష్, మహిళా అధ్యక్షురాలు శారద,సుమంత్ రావులతో పాటు ఎంపీడీవోలు వేణుగోపాల్, రాము,ఎంపీవోలు బండ రాజశేఖర్,సతీష్ పాల్గొని మద్దతు



తెలిపినట్లు చెప్పారు.ప్రభుత్వం స్పందించి తమ సమస్యలను పరిష్కరించుకుంటే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని ఈ సందర్భంగా హెచ్చరించారు. అలాగే పంచాయతీ కార్యదర్శుల యూనియన్ తరపున గౌరి రమేష్, మనోహర్ రెడ్డి, రేవంత్ రెడ్డి, మహేందర్ రావు, చంద్రశేఖర్, బండ ప్రసాద్, కిరణ్ కుమార్ రెడ్డి, వాహెజ్, మమత, సుస్మిత, లావణ్యలతో పాటు జిల్లావ్యాప్తంగా ఉన్న పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని ధర్నాను విజయవంతం చేసినట్లు అజయ్ కుమార్ వివరించారు.

## ఒకే పౌరుడికి రెండు ఓట్లు నేరం

*** తహసీల్దార్ కనకయ్య**



చిగురుమామిడి, ప్రజాస్ఫూర్తి: దేశంలో ప్రతి పౌరుడికి ఒకే ఓటు హక్కు ఉండాలని, రెండు చోట్ల ఓటు కలిగి ఉండడం చట్టప్రకారం నేరమని చిగురుమామిడి తహసీల్దార్ కనకయ్య స్పష్టం చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు చేపట్టిన ఓటర్ల ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని ఇందుర్తి గ్రామపంచాయతీ ఆవరణలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఓటర్ల జాబితా వివరాలను గ్రామస్తులకు వెల్లడించి పలు సూచనలు చేశారు.గ్రామంలో డబుల్ ఓట్లు, మరణించిన వారి పేర్లను పరిశీలించి తొలగించామని తహసీల్దార్ తెలిపారు. పరిధి దాటి నమోదైన (నాన్ మ్యాపింగ్) 204 మంది ఓటర్లను గుర్తించి నోటీసులు జారీ చేశామని, వారిలో 142 మంది తగిన ఆధారాలతో హాజరైనట్లు పేర్కొన్నారు.స్పందించని వారికి మళ్లీ నోటీసులు ఇవ్వనున్నారు. ఈ రోజు నుంచి అక్టోబరు 17 వరకు మండలంలోని రోజుకో గ్రామంలో విచారణ (హియరింగ్) నిర్వహిస్తామని, అక్టోబరు 19న ఓటర్ల తుది జాబితాను ప్రకటిస్తామని వెల్లడించారు. ఈ ఏడాది అక్టోబరు 1 నాటికి 18 ఏళ్ల నిండే వారు ఫారం6 ద్వారా కొత్త ఓటుకు దరఖాస్తు చేసుకోవాలని, పేర్లు, చిరునామా సవరణలు లేదా ఒకే కుటుంబానికి చెందిన ఓట్లను ఒకే పోలింగ్ కేంద్రానికి మార్చుకునేందుకు ఫారం8 వినియోగించుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ చింతపూల నరేందర్, మండల సూపర్‌వైజర్ (ఆర్ఐ) నాగరాజు, పంచాయతీ అధికారులు బాలయ్య, శ్రీనివాస్, వార్డు సభ్యులు, బిఎల్వోలు కుట్ల విజయ, మవురవ్వ, కొడకండ్ల లక్ష్మి, చింతపూల సరస్వతి, గ్రామస్థులు పాల్గొన్నారు.

## విద్యానగర్ కాలనీ ఆరో వార్డు నందు ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు



ప్రజాస్ఫూర్తి, కొత్తగూడెం: చుంచుపల్లి మండలం విద్యానగర్ కాలనీ గ్రామపంచాయతీ ఆరో వార్డు నెంబర్ వాడపల్లి జకరయ్య ఆధ్వర్యంలో వార్డులో జెసిబి సహాయంతో ఉదయం నుండి సాయంత్రం వరకు వార్డ్ నెంబర్ దగ్గరుండి పారిశుద్ధ్య పనులను పర్యవేక్షిస్తూ పనులను చేయిస్తున్నారు . ఈ సందర్భంగా వాడపల్లి జకరయ్య మాట్లాడుతూ వార్డులోని వీధులలో రోడ్డుకి ఇరువైపులా పెరిగిన పిచ్చి మొక్కలతోపాటు చెత్తాచెదారాన్ని తీసివేయటంతో పాటు ,సైడ్ కాలువలను శుభ్రం చేయించడంతోపాటు దగ్గరుండి ప్రతి వీధిలో బ్లీచింగ్ చల్లించారు . గ్రాస్ కట్టర్ ద్వారా గడ్డిని తీయించారు . పరిశుభ్రత వల్ల సీజనల్ వ్యాధులు తగ్గుతాయని ఆయన అంటూ, పారిశుద్ధ్య సిబ్బందికి వార్డు ప్రజలు సహకరించాలని ఆయన కోరారు .

## సూర్యాపేట జిల్లా బీజేపీ కిసాన్ మోర్చా సెక్రెటరీగా రామినేని అశోక్



గరిడేపల్లి, ప్రజాస్ఫూర్తి: భారతీయ జనతా పార్టీ సూర్యాపేట జిల్లా కిసాన్ మోర్చా సెక్రెటరీగా గరిడేపల్లి మండలానికి చెందిన రామినేని అశోక్ నియమితులయ్యారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు ఆదేశాల మేరకు, జిల్లా అధ్యక్షురాలు చల్లా శ్రీలత రెడ్డి అధ్యక్షతన ఈ నియామకం జరిగింది.నియామక పత్రాన్ని అందుకున్న రామినేని అశోక్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు, జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు కంచర్ల నరసింహారెడ్డి, జిల్లా అధ్యక్షురాలు చల్లా శ్రీలత రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. తన నియామకానికి సహకరించిన మాజీ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి, బొబ్బ భాగ్యారెడ్డితో పాటు పార్టీ నాయకులకు ధన్యవాదాలు తెలిపారు.సూర్యాపేట జిల్లాలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై క్షేత్రస్థాయిలో నిరంతరం పోరాడతానని అశోక్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు సంక్షేమ పథకాలను గ్రామస్థాయిలో ప్రజలకు చేరువ చేస్తామని చెప్పారు. రైతుల హక్కుల పరిరక్షణ కోసం బీజేపీ కిసాన్ మోర్చా తరపున ముందుండి పోరాడతానని స్పష్టం చేశారు.పార్టీ బలోపేతంతో పాటు అన్నదాతల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని సెక్రెటరీ రామినేని అశోక్ పేర్కొన్నారు. ఆయన నియామకంపై బీజేపీ నాయకులు, కార్యకర్తలు, గరిడేపల్లి మండల యువత హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

## పంట మార్పిడి లో వరి సాగును తగ్గించి ప్రత్యామ్నాయ పంటలపై రైతులు దృష్టి సారించాలి

*** జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి**



భువనగిరి, ప్రజాస్ఫూర్తి : గురువారం బొమ్మలరామారం మండలం మేడిపల్లి గ్రామంలో చేపడుతున్న పాలీహౌస్, కూరగాయల సాగును జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి పరిశీలించారు. పాలీ హౌస్‌లో సాగు చేస్తున్న జెర్బెరా పూలను కలెక్టర్ పరిశీలించి, రైతుతో సాగు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎన్ని ఎకరాల్లో పాలీహౌస్ ఏర్పాటు చేశారు, ఎన్ని సంవత్సరాలుగా జెర్బెరా పూల సాగు చేస్తున్నారు, వార్షికంగా సాగుకు ఎంత ఖర్చు అవుతుంది, ఎంత ఆదాయం వస్తుంది అనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. పూలను ఎక్కడ విక్రయిస్తున్నారు. పాలీహౌస్ ద్వారా పూల సాగు చేపట్టడం వల్ల కలిగే ప్రయోజనాలు, పంట దిగుబడి, మార్కెటింగ్ అవకాశాలను పరిశీలించారు. అదేవిధంగా అదే గ్రామంలో మరో రైతు సాగు చేస్తున్న టమాటా, మిర్చి పంటలను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఎన్ని సంవత్సరాలుగా ఈ పంటలను సాగు చేస్తున్నారు, ఎకరాకు ఎంత దిగుబడి వస్తుంది, పంట సాగుకు అయ్యే ఖర్చు, లభిస్తున్న ఆదాయం తదితర వివరాలను రైతును అడిగి తెలుసుకున్నారు. పండించిన టమాటా, మిర్చిని స్థానిక మార్కెట్‌లో విక్రయిస్తున్నారా లేదా ఇతర ప్రాంతాలకు తరలించి విక్రయిస్తున్నారా అనే విషయాలను కూడా తెలుసుకున్నారు. తక్కువ నీటితో డ్రిప్ ద్వారా సాగు చేసి నీటిని ఆదా చేసుకోనీ ఆర్థికంగా లబ్ధి పొందాలని జిల్లా కలెక్టర్ రైతులకు సూచించారు. ఈ కార్యక్రమం లోజిల్లా ఉద్యానవన శాఖ అధికారి హేమలత, సర్పంచ్ సంబంధింత అధికారులు పాల్గొన్నారు.

## న్యాయమైన డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలి

**– టీజీఈజేఏసీ మహాధర్నా విజయవంతం**



ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: రాష్ట్రంలో సుదీర్ఘకాల,గా పెండింగ్‌లో ఉన్న ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, గెజిటెడ్ అధికారులు, కార్మికులు, పెన్షనర్ల న్యాయమైన డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని తెలంగాణ గవర్నమెంట్ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ జిల్లా చైర్మన్ అమరనేని రామారావు, కన్వీనర్ సంగం వెంకటపుల్లయ్య డిమాండ్ చేశారు. టీజీఈజేసీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చౌక్‌లో సోమవారం నిర్వహించిన 'మహాధర్నా' విజయవంతమైంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2వ వేతన సవరణ కమిషన్ నుండి నివేదికను తెప్పించుకొని తక్షణమే అమలు చేయాలని, ఉద్యోగులు, పెన్షనర్లకు రావలసిన కరువుభత్యాలను వెంటనే విడుదల చేయాలని, ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆర్థిక బకాయిలు తక్షణమే మంజూరు చేయాలి. సీపీఎస్ పూర్తిగా రద్దు చేసి ఓపీఎస్ విధానాన్ని పునరుద్ధరించాలని, నూతన ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్‌ను నగదు రహిత ప్రాతిపదికన సక్రమంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ధర్నా చౌక్ నుండి భారీ నిరసన ర్యాలీగా వెళ్లి జిల్లా అదనపు కలెక్టర్ వేణుగోపాల్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో టీజీఈజేఏసీ జిల్లా నాయకులు భార్గవ్ చైతన్య, పి.నర్సయ్య, ఎం.వెంకటేశ్వర్లు, వెంకటరమణ, బి. రవి, భగవాన్ రెడ్డి, ఎం.రాజేష్, దినేష్, వెస్లీ, కృష్ణ ప్రసాద్, టి.సుశీల, హరిలాల్, రాములు, లక్ష్మణ్ నాయక్, వి.శ్రీనివాస్, దుర్గయ్య, ట .శ్రీనివాస రెడ్డి, జమలా రెడ్డి, బందు వెంకటేశ్వరావు, సతీష్ కుమార్, అజ్మీరా రామ్ రవి, అశోక్ చౌహాన్, వివిధ ఉద్యోగ, ఉపాధ్యాయ, గెజిటెడ్ అధికారుల సంఘాల ప్రతినిధులు, పెన్షనర్లు, కార్మికులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఎకరాకూ సాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యం

*** ప్రభుత్వ విప్ ఆలేరు శాసన సభ్యులు బీర్ల ఐల్లయ్య**



భువనగిరి, ప్రజాస్ఫూర్తి : గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో గంధమల్ల ముంపు బాధితులకు పరిహారం చెక్కుల పంపిణీ కార్యక్రమం లో ప్రభుత్వ విప్ ఆలేరు శాసన సభ్యులు బీర్ల ఐలయ్య,జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, రెవిన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి పాల్గొన్నారు. గంధమల్ల రిజర్వాయర్ నిర్మాణంలో భూములు కోల్పోతున్న ముంపు బాధితులకు నష్టపరిహారం క్రింద 352 ఎకరాలకు 88.84 కోట్ల రూపాయల చెక్కులను రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ గంధమల్ల రిజర్వాయర్ ముంపు బాధితులకు న్యాయం చేసేందుకు గాను ఎకరాకు రూ.24.50 లక్షలకు పరిహారాన్ని పెంచి రైతులకు న్యాయం చేసిందని తెలిపారు. ప్రాజెక్టు పరిధిలో సుమారు రూ.100 కోట్లతో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేస్తామని, భూములు కోల్పోయిన నిర్వాసితులకు అందులో ఉపాధి, అవకాశాల్లో మొదటి ప్రాధాన్యత కల్పిస్తామని తెలిపారు. గంధమళ్ళ రిజర్వాయర్ కోసం భూములు కోల్పోయిన రైతులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని వెల్లడించారు.జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి మాట్లడుతూ గంధమల్ల రిజర్వాయర్ కోసం భూములు ఇచ్చిన రైతులు ఖాతాలో డబ్బులు జమ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ డివిజనల్ అధికారి కృష్ణా రెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ప్రమీల, ఇరిగేషన్ యస్ ఈ రవీందర్, సర్పంచ్, ప్రజా ప్రతినిధులు,గంధమల్ల రిజర్వాయర్ ముంపు బాధిత రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## వలిగొండ మండల కాంగ్రెస్ పార్టీ నూతన కార్యవర్గాన్ని ప్రకటించిన ఎమ్మెల్యే కుంభం



వలిగొండ, ప్రజాస్ఫూర్తి : వలిగొండ మండల కాంగ్రెస్ పార్టీ నూతన కార్యవర్గాన్ని గురువారం భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ప్రకటించారు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షునిగా వలిగొండకు చెందిన బత్తిని సహదేవ్ గౌడ్ ఉపాధ్యక్షులుగా శనిగారపు పాండు గంధ మల్ల నరసింహ ప్రధాన కార్యదర్శిగా మామిడి సత్తిరెడ్డి దండెం సరిత గంగాపురం సాయిబాబా సూదిని రాజశేఖర్ రెడ్డి అదేవిధంగా కార్యదర్శులుగా బుగ్గ వెంకటేశం గంగాపురం సంధ్యారాణి కసర బోయిన నరసింహ బండారి అనిత కళ్లెం బాల శంకర్ గౌడ్ రేకల బాలరాజ్ గౌడ్ ప్రకటించగా ఎక్స్ క్యూట్ మెంబర్లుగా ఏర్పుల యాదయ్య ఎమ్మె నవ్య ఎడవెల్లి మల్లేశం జక్కల శోభ రాణి దండ మల్లికార్జున్ మాదాసు రాణి కేసరి మహేందర్ రెడ్డి కందుల నరేష్ కళ్లెం రాములు ను ప్రకటించారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నూతనంగా ఏర్పడిన మండల కాంగ్రెస్ పార్టీ కార్యవర్గం నిరంతరం ప్రజల మధ్య ఉంటూ సమస్యల పరిష్కారం కోసం పాటుపడాలని సూచించారు ప్రజా ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ఎప్పటికప్పుడు ప్రజల్లోకి తీసుకెళ్లి వివరించాలని అన్నారు ఈ సందర్భంగా నూతన కార్యవర్గ నియామక పత్రాన్ని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సహదేవుకు ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పాశం సత్తిరెడ్డి మాజీ ఎంపీపీ నూతి రమేష్ రాజు వలిగొండ సింగిల్ విండో చైర్మన్ గరిసె రవివలిగొండ ముద్దాపురం గ్రామాల సర్పంచులు కుంభం వెంకట్ పాపిరెడ్డి సామ రామ్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ నాయకులు బత్తిని లింగయ్య గంగాపురం సతీష్ రైతు సంఘం నాయకులు నరేందర్ రెడ్డిగౌడుగూడూరు శ్రీధర్ రెడ్డి కాసుల గుండు దానయ్య గౌడువెంకన్న గౌడ్ మత్స్యగిరి గుట్ట డైరెక్టర్ రాధారపు రమేష్ ఎమ్మె లింగస్వామి ఉలిపే మల్లేశం

## హైవే పై బెల్ట్ షాపులు నిషేధం ఎస్ ఐ శ్రీకాంత్ గౌడ్

గరిడేపల్లి, ప్రజాస్ఫూర్తి : జాతీయ రహదారి పై బెల్ట్ షాపులు నిషేధిస్తున్నట్టు గరిడేపల్లి ఎస్సై శ్రీకాంత్ గౌడ్ తెలిపారు. మండలంలో హైవే వెంట నిర్వహిస్తున్న బెల్ట్ షాపులు, హోటల్స్, కిరణం దుకాణాల యజమానులను పోలీస్ స్టేషన్కు పిలిపించి గురువారం కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఎన్ హెచ్ 167 జాతీయ రహదారి వెంట ఉన్న ప్రతి దుకాణంలో సీసీ కెమెరాలు వెంటనే ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. నేషనల్ హైవే పై ప్రజల భద్రతకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ప్రతి ఒక్కరు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. హైవేపై వాహనాలను నిలిపి ట్రాఫిక్ అంతరాయానికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్ఐ జగన్నాథం, పోలీస్ సిబ్బంది, పలువురు వ్యాపారస్తులు తదితరులు పాల్గొన్నారు.

## గరిడేపల్లిలో మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడలు



గరిడేపల్లి, ప్రజాస్ఫూర్తి: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్ జి ఎఫ్) మండల స్థాయి క్రీడలను సెప్టెంబర్ 1 నుంచి 3వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు మండల విద్యాధికారి పానుగోతు చత్రు నాయక్ తెలిపారు. ఫిజికల్ డైరెక్టర్లు, వ్యాయామ ఉపాధ్యాయుల సన్నాహక సమావేశంలో క్రీడల వివరాలను వెల్లడించారు.వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, అథ్లెటిక్స్ పోటీలు అండర్ 14, అండర్ 17 బాలబాలికలకు నిర్వహించనున్నారు. వాలీబాల్ పోటీలు జడ్పీహెచ్ఎస్ పొనుగోడులో, ఖోఖో, కబడ్డీ, అథ్లెటిక్స్ పోటీలు జడ్పీహెచ్ఎస్ వెలిదండలో జరుగుతాయి. పాల్గొనే విద్యార్థులు తప్పనిసరిగా బోనఫైడ్ సర్టిఫికెట్ తీసుకురావాలని సూచించారు.సమావేశంలో పీడీలు, వ్యాయామ ఉపాధ్యాయులు హుస్సేన్, రాంప్రసాద్, సైదిరెడ్డి, సైదులు, ధనమ్మ, ప్రదీప్, గురుస్వామి, ప్రమీల, బాబు, సీఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

## పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి

*** లక్కపాక ప్రవీణ్ కుమార్**



ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: సిపిఎస్ ను రద్దు చేయాలని పాత పెన్షన్ విధానాన్ని ప్రోత్సహించాలని సిపిఎస్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు లక్కపాక ప్రవీణ్ కుమార్ అన్నారు. గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగిన ఉద్యోగ ఉపాధ్యాయ కార్మిక సంఘాల ధర్నా కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సిపిఎస్ విధానం వల్ల ఉద్యోగులకు రిటైర్ అయిన తరువాత నెలకు ఐదు వేలకు మించి పెన్షన్ రావడం లేదని, జీవితమంతా ప్రభుత్వానికి సేవ చేసిన ఉద్యోగులకు పెన్షన్లు తగ్గించడం దారుణమని అన్నారు. రాష్ట్రంలో దాదాపుగా 2,60,000 మంది సిపిఎస్ ఉద్యోగులు వున్నారని ఆయన అన్నారు. గత ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ తన ఎన్నికల మేనిఫెస్టోలో సిపిఎస్ విధానం రద్దు చేసి పాత పెన్షన్స్ అమలు చేస్తామని హామీ ఇచ్చిందని ఆయన అన్నారు. ఆగస్టు 23 వ తేదిన సిపిఎస్ రద్దు కోసం హైదరాబాదు లో మహాదర్నా కార్యక్రమం నిర్వహించామని, రాబోయే నవంబర్ మాసంలో కూడ మరొకసారి లక్ష మంది తో సభను నిర్వహిస్తామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల్లో నమ్మకం పెరిగేలా నాణ్యమైన వైద్య సేవలు అందించాలి

*** జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి..**



భువనగిరి, ప్రజాస్ఫూర్తి: ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల్లో నమ్మకం మరింత పెరిగేలా నాణ్యమైన వైద్య సేవలు అందించాలని, గర్భిణీలు ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ప్రసవించేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి వైద్య ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు.గురువారం భువనగిరి మున్సిపాలిటీ పరిధిలోని అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌ను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రతిరోజూ ఆసుపత్రికి వచ్చే ఔట్ పేషెంట్ల సంఖ్యను అడిగి తెలుసుకున్నారు. రోగుల ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, వారికి అందిస్తున్న చికిత్స, వైద్య సేవలు, మందుల పంపిణీ తదితర వివరాలను ఆన్‌లైన్‌లో సక్రమంగా నమోదు చేస్తున్నారా లేదా అని పరిశీలించారు. ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే ప్రతి రోగికి మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు, వారి వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. ఈ నెలలో ఎన్ని ప్రసవ అంచనా తేదీలు (ఈడీడీ) ఉన్నాయని, ఇప్పటివరకు ఎన్ని ప్రసవాలు ప్రభుత్వ ఆసుపత్రుల్లో, ఎన్ని ప్రైవేట్ ఆసుపత్రుల్లో జరిగాయనే వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. సాధ్యమైనంత వరకు సాధారణ ప్రసవాలు ఎక్కువగా జరిగేలా వైద్యులు, వైద్య సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు.ఈ తనిఖీలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి మనోహర్, సంబంధిత అధికారులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు హైవే పెట్రోలింగ్

* **జిల్లా టాస్క్ ఫోర్స్ కమిటీ.**

ప్రజాస్ఫూర్తి, నల్లగొండ : హైదరాబాద్ విజయవాడ జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు హైవే పెట్రోలింగ్ పెంచడంతో పాటు, ప్రమాదాలు సంభవించకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని "జిల్లా స్థాయి జాతీయ రహదారి టాస్క్ ఫోర్స్ కమిటీ " నిర్ణయించింది. ఈ మేరకు గురువారం స్థానిక సంస్థల ఇన్చార్జి అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి అధ్యక్షతన జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన జాతీయ రహదారి జిల్లా టాస్క్ ఫోర్స్ ససమావేశంలో బుధవారం తెల్లవారు ఝామున సూర్యపేట జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదం మొదలుకొని, జాతీయ రహదారిపై సంభవిస్తున్న రహదారి ప్రమాదాల పై సమీక్షించడం జరిగింది. ఈ సమీక్ష సందర్భంగా స్థానిక సంస్థల ఇన్చార్జి అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ రహదారిపై ప్రమాదాలను నివారించడంలో భాగంగా రహదారిపై ప్రమాదాలు



జరగకుండా ఏర్పాటు చేసే సూచిక బోర్డులతో పాటు, దాబాలు,హోటళ్లు, పార్కింగ్ స్థలాలు, ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన చర్యలు తదితర అంశాలపై మరోసారి పూర్తిస్థాయిలో డ్రైవర్లు,ప్రజలు, వాహనదారులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని అన్నారు .రోడ్డుకిరుపక్కల రోడ్డును ఆక్రమించి ఏర్పాటు చేసే దాబాలు, హోటల్లు, వాహనాల కు గాలిని కొట్టే షాపులు, టీ కొట్లు, పాన్ డబ్బాల వంటివి రోడ్డుపై కాకుండా దూరంగా ఏర్పాటు చేసుకునేలా చూడాలని, ఇందుకు అవసరమైతే రోడ్డును ఆక్రమించి షాపులు ఏర్పాటు చేసుకున్న వారికి నోటీసులు ఇవ్వాలని, నోటీసులకు స్పందించకుంటే క్రేన్లు ఏర్పాటు చేసి తొలగించేలా చూడాలని అన్నారు. జాతీయ రహదారిపై ప్రమాదాలు సంభవించినప్పుడు తక్షణ చర్యలు తీసుకునేందుకు ప్రతి 30, 40 కిలోమీటర్లకు ఒకటి చొప్పున అంబులెన్స్, క్రేన్లు ఏర్పాటు చేస్తే బాగుంటుందని, ప్రమాదాలు సంబంధించినప్పుడు అంబులెన్స్, ఆసుపత్రి సిబ్బంది, పోలీసు, హైవే పెట్రోల్ సిబ్బంది తో పాటు, సంబంధిత శాఖలందరూ స్పందించాల్సిన అవసరం ఉందని, అలాగే డ్రైవర్లు నిరంతరం డ్రైవింగ్ చేయడం వలన ఉదయం సమయంలో ప్రమాదాలు సంభవిస్తున్నాయని, అలా కాకుండా ప్రతి 2 గంటలకు ఒకసారి ఆగి తిరిగి డ్రైవింగ్ చేసేలా అవగాహన కల్పించాలని, అంతేకాక 80 కిలోమీటర్లు మించి వేగం వెళ్లకుండా నియంత్రించాలని, ఎవరైనా రోడ్డు నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన జరిమానాలు విధించాలని, ట్రక్కులకు, జిల్లా రవాణా శాఖ డిప్యూటీ కమిషనర్ వాణి మాట్లాడుతూ జాతీయ రహదారిపై ప్రమాదాలు సంభవించకుండా అన్ని నిబంధనలు పాటిస్తూ జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు, ప్రతి ఒక్కరు వ్యక్తిగత భద్రతలో భాగంగా సీట్ బెల్ట్ , హెల్మెట్ ధరించాలని, రహదారులపై ప్రత్యేకించి జాతీయ రహదారిపై పెట్రోలింగ్ పెంచాలని ,1033 పై విస్తృత ప్రచారం కల్పించాలని, నిబంధనలు ఉల్లంఘించిన వారికి పెనాల్టీలు విధించాలని సూచించారు.జిల్లా రెవెన్యూ అధికారి దశరథ ,ఆర్ అండ్ బి, జాతీయ రహదారి, వైద్య ఆరోగ్య, పోలీస్,ఇతర సంబంధిత శాఖల అధికారులు ఈ సమావేశానికి హాజరయ్యారు.

# కేజీబీవీ సందర్శించిన స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు



భువనగిరి, ప్రజాస్ఫూర్తి: గురువారం భువనగిరిలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)ని జిల్లా అదనపు కలెక్టర్ భాస్కర్ రావు సందర్శించి పాఠశాలలోని విద్యా, వసతి సౌకర్యాలను గురించి సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న విద్యా బోధన, భోజనం, వసతి, తాగునీరు, పారిశుద్ధ్య సౌకర్యాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. తరగతి గదికి వెళ్లి విద్యార్థులతో ముచ్చటించారు.మంచి మంచి గాచదుకోవాలని అన్నారు విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతి సౌకర్యాలు కల్పించాలని, పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని అధికారులకు సూచించారు. విద్యార్థుల భద్రత, ఆరోగ్యం విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# యాప్ లో ఎరువులు బుక్ చేసుకోవాలి



ప్రజాస్ఫూర్తి, మెదక్ జిల్లా:మెదక్ డివిజన్ పరిధిలో రైతుల అవసరాలకు సరిపడా యూరియా ఎరువులు అందుబాటులో ఉన్నాయని వ్యవసాయ శాఖ మెదక్ డివిజన్ సహాయ సంచాలకులు అమీనా బి తెలిపారు. గురువారం మెదక్ మండలం ర్యాలమడుగు గ్రామంలో రైతులకు ఎఫ్ఎఫ్ఎస్ యాప్ ద్వారా ఎరువుల బుకింగ్ పై అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా ఏడిఏ అమీనా బి మాట్లాడుతూ మెదక్, పాపన్నపేట, హవేలీ ఘనపూర్, శంకరంపేట (ఆర్) మండలాల్లో రైతుల అవసరాలకు అనుగుణంగా యూరియా నిల్వలు ఉన్నాయని తెలిపారు. రైతులు ఎలాంటి ఆందోళన కు గురికావాల్సిన అవసరం లేదని, అవసరమైన ఎరువులను యాప్ ద్వారా ముందస్తుగా బుక్ చేసుకుని వ్యవసాయ శాఖ సూచనలు, నిబంధనల మేరకు పొందాలని సూచించారు. ఎరువుల బుకింగ్ లో పారదర్శకతను పెంచడంతో పాటు రైతులకు అవసరమైన సమయంలో ఎరువులు అందేలా యాప్ ఉపయోగపడుతుందని వివరించారు. రైతులందరూ యాప్ ను సద్వినియోగం చేసుకుని ముందస్తుగా ఎరువులు బుక్ చేసుకోవాలని, లభ్యతపై అనవసర ఆందోళన చెందవద్దని కోరారు. ఈ కార్యక్రమంలో మెదక్ మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్, వ్యవసాయ విస్తరణ అధికారి రాజశేఖర్, గ్రామ సర్పంచ్ రవితో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూములను కాపాడండి

* **తహసీల్దార్ కు వినతి పత్రం అందజేసిన సీపీఎం నాయకులు**



కూసుమంచి, ప్రజా స్ఫూర్తి: మండలంలోని నాయకన్ గూడెం గ్రామంలో కొందరు వ్యక్తులు ప్రభుత్వ భూములను, ప్రభుత్వ కుంటలను, ఆక్రమించుకున్నారని, రెవిన్యూ అధికారులు తక్షణమే ప్రభుత్వ భూములను సర్వే చేసి ప్రభుత్వ భూములను కాపాడాలని కోరుతూ.. సిపిఎం గ్రామశాఖ కార్యదర్శి కర్ణబాబు, సిపిఎం నాయకులు గురువారం తహసిల్దార్ సైదులు కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కర్ణబాబు మాట్లాడుతూ ప్రభుత్వ భూములను, కుంటలను ఆక్రమించుకుంటే భవిష్యత్ తరాలకు భవిష్యత్తు అవసరాలకు ప్రభుత్వ భూములు కరువుతాయని తద్వారా అభివృద్ధి కుంటుపడుతుందని అన్నారు. తక్షణమే అధికారులు స్పందించి ప్రభుత్వ భూములను సర్వే చేసి ఆక్రమణదారుల నుంచి విడిపించాలని సూచించారు. లేనిపక్షంలో సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు గడ్డం మురళి, సింగం సోమయ్య, సింగం కృష్ణంరాజు, ఎస్ కె ఖాసీ, తదితరులు పాల్గొన్నారు.

# అనుమతులు లేని 'వింగ్స్ పాఠశాల'పై కఠిన చర్యలు తీసుకోవాలి

* **ఏ ఐ పి ఎస్ యు జిల్లా కార్యదర్శి గడపాలె పరమేష్ డిమాండ్**



ప్రజాస్ఫూర్తి , భైంసా: నిర్మల్ జిల్లా కేంద్రంలో విద్యాశాఖ ముందస్తు అనుమతులు మరియు ఎలాంటి గుర్తింపు లేకుండా చట్టవిరుద్ధంగా నడుస్తున్న వింగ్స్ పాఠశాల యాజమాన్యంపై విద్యాశాఖాధికారులు వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని అఖిల భారత ప్రగతిశీల విద్యార్థి సంఘం నిర్మల్ జిల్లా కార్యదర్శి గడపాలె పరమేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో వినతిపత్రం సమర్పించినట్లు ఆయన తెలిపారు.ఈ సందర్భంగా గడపాలి పరమేష్ మాట్లాడుతూ. సదరు వింగ్స్ పాఠశాల యాజమాన్యం ప్రభుత్వ నిబంధనలను పూర్తిగా ఉల్లంఘిస్తూ, ఎలాంటి అనుమతులు లేకుండా విద్యా సంస్థను నిర్వహిస్తూ విద్యార్థుల భవిష్యత్తుతో, వారి భద్రతతో చెలగాటమాడుతోందని తీవ్రంగా మండిపడ్డారు. గుర్తింపు లేని ఇటువంటి పాఠశాలల్లో తరగతులు నిర్వహించడం వల్ల అమాయక విద్యార్థుల విద్యా సంవత్సరం తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.జిల్లా విద్యాశాఖాధికారి వెంటనే స్పందించి, అనుమతులు లేని విన్స్ పాఠశాలపై సమగ్ర విచారణ జరిపి చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోవాలని, విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఆ పాఠశాలను వెంటనే మూసివేసేలా ఉత్తర్వులు జారీ చేయాలని ఏఐపిఎస్ యు తరపున విజ్ఞప్తి చేశారు.

# విద్యార్థుల భవిష్యత్తు తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

* **జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా.**

జనగామ/పాలకుర్తి,ప్రజాస్ఫూర్తి : విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని, ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందించేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధతో పని చేయాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. గురువారం పాలకుర్తి మండలంలోని పీఎం శ్రీ పాఠశాలను కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి తరగతి గదులు, కంప్యూటర్ ల్యాబ్, వంటశాల, పాఠశాల పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడి హిందీ, ఇంగ్లీష్, గణితం, సాంఘిక శాస్త్రం వంటి సబ్జెక్టుల్లో వారి అభ్యాస సామర్థ్యాన్ని పరీక్షించారు. బ్లా



క్‌బోర్డుపై గణితం, సాంఘిక శాస్త్రానికి సంబంధించిన అంశాలను స్వయంగా బోధిస్తూ విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు చదవడం, రాయడంతో పాటు ప్రతి సబ్జెక్టును సులభంగా అర్థం చేసుకునేలా బోధన సాగించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ పరిశీలనలో ఎంపీడీఓ వేదవతి, ప్రధానోపాధ్యాయురాలు శోభా రాణి, సర్పంచ్ కె. విజయ, గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ క్రీడా దినోత్సవంలో ప్రధాని మోదీ వర్చువల్ ప్రసంగం

జయశంకర్ భూపాలపల్లి జిల్లా , ప్రజా స్ఫూర్తి : జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని మై భారత్ ఆధ్వర్యంలో 'ఖేలో ఇండియా సంవాద్-ఖేల్ కీ బాత్, ప్రధానమంత్రి కే సాత్' వర్చువల్ కార్యక్రమాన్ని గురువారం భూపాలపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించారు. జిల్లా యువజన అధికారి భూక్య సంజీవ్ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థినీ విద్యార్థులు ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్ ప్రసంగాన్ని వీక్షించారు.ఈసందర్భంగా ప్రధాని మాట్లాడుతూ క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు యువతలో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని అన్నారు. యువత క్రీడలను జీవితంలో




భాగంగా చేసుకుని ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. ఖేలో ఇండియా కార్యక్రమాల ద్వారా గ్రామీణ, మారుమూల ప్రాంతాల్లోని క్రీడా ప్రతిభను వెలికితీసి ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. యువత ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని క్రీడా రంగంలో ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఏ. రమణరావు, జిల్లా స్పోర్ట్స్ అధికారి రఘు, ఖేలో ఇండియా కోచ్ శ్రీనివాస్, మై భారత్ ప్రోగ్రాం ఆర్గనైజర్ వెల్దండ సురేష్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ కవిత, కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# విద్యానగర్ కాలనీలో సర్ గ్రామసభ సక్సెస్

* **రుజువు ఉంటేనే ఓటు : తాసిల్దార్ నాగరాజు**

ప్రజాస్ఫూర్తి , కొత్తగూడెం : చుంచుపల్లి మండలం విద్యానగర్ కాలనీ గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్ డ్రాఫ్ట్ ఓటర్ల జాబితా పై గ్రామ సర్పంచ్ భూక్య శాంతి శ్రీ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు . ఈ కార్యక్రమంలో మండల తహసీల్దార్ నాగరాజు పాల్గొని ఆయన మాట్లాడుతూ సర్ లో నోమ్యాపింగ్ , అనోమలిస్ ఓటర్లకు నోటీసులు జారీ చేశామని , 2002 ఓటరు జాబితాకు అనుగుణంగా మ్యాపింగ్ కాలేదని జాబితాలో పేర్లు నమోదు తప్పుగా ఉండటం ,, ఇంటిపేరు , వయసు , చిరునామా లోపాలు ఉండటంతో వారికి నోటీసులు ఇచ్చామని ఎన్నికల కమిషన్ సూచించిన 12 రకాల




ఆధారాలను బి ఎల్ ఓ లకు చూపించి నూతన ఓటర్ల జాబితాలో ఓటు ఉండే విధంగా చూసుకోవాలని ఆయన సూచిస్తూ పోలింగ్ బూత్ ల వారీగా నో మ్యాపింగ్ , అనోమలిస్ ఓటర్ లిస్టును బిఎల్ఓ లకు అందజేశారు. నోటీసులు అందుకున్న ఓటర్లు 12 రకాల ధ్రుపత్రాలు సమర్పించాలని , అభ్యంతరాలను అక్టోబర్ 15 వరకు స్వీకరిస్తామని , 19వ తేదీన నూతన ఓటర్ల జాబితా ప్రచురిస్తారని ఆయన అన్నారు. స్థానిక ప్రజా ప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ వాసిరెడ్డి మురళి , వార్డ్ మెంబర్స్ గజెల్లి కృష్ణమూర్తి , మాలోత్ శంకర్ , భాగం నాగమణి , పూర్ణ , పంచాయతీ సిబ్బంది , బి ఎల్ వో లు , గ్రామస్తులు పాల్గొన్నారు .

# పెద్ది సుదర్శన్ రెడ్డి సేవలు చిరస్మరణీయం

* **ప్రతి నియోజకవర్గంలో కాంస్య విగ్రహం ఏర్పాటు చేయాలి**
* **సంతాప సభలో బోయినపల్లి వినోద్‌కుమార్**

జయశంకర్ భూపాలపల్లి జిల్లా, (ప్రజా స్ఫూర్తి): తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అలుపెరగని పోరాటం చేసిన నర్సంపేట మాజీ ఎమ్మెల్యే, దివంగత పెద్ది సుదర్శన్‌రెడ్డి సేవలు చిరస్మరణీయమని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో గురువారం దివంగత పెద్ది సుదర్శన్‌రెడ్డి సంతాప సభ నిర్వహించారు. వరంగల్ జిల్లా మాజీ జడ్పీ చైర్‌పర్సన్, భూపాలపల్లి జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షురాలు గండ్ర జ్యోతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి బోయినపల్లి వినోద్‌కుమార్, భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, భూపాలపల్లి, నర్సంపేట నియోజకవర్గాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వినోద్‌కుమార్ మాట్లాడుతూ పెద్ది సుదర్శన్‌రెడ్డి మృతిచెందిన రోజు బీఆర్ఎస్ అగ్రనేతలు, మాజీ మంత్రులు, జిల్లా, రాష్ట్ర స్థాయి నాయకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కుటుంబానికి అండగా నిలిచారని గుర్తుచేశారు. కేసీఆర్ స్వయంగా ఆస్పత్రికి వచ్చి పరామర్శించడంతో పాటు నల్లబెల్లిలోని సుదర్శన్‌రెడ్డి కుటుంబ సభ్యులను కలిసి సుమారు అరగంట పాటు గంభీరంగా గడిపారని తెలిపారు. హరీశ్‌రావు, కేటీఆర్‌తో పాటు ఇతర నాయకులు కూడా కుటుంబ సభ్యులకు అండగా నిలిచారని చెప్పారు.

# పంచశీల స్కూల్ లో ఘనంగా రాఖీ పౌర్ణమి వేడుకలు



కూకట్ పల్లి, ప్రజాస్ఫూర్తి : మూసా పేట లోని పంచశీల స్కూల్ లో గురువారం రాఖీ పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఒక్కరినొక్కరు రాఖీ కట్టుకుని శుభాకాంక్షలు తెలుపుతున్నారు. నీకు నేను రక్ష.. నాకు నీవు రక్ష.. మనమిద్దరం దేశానికి రక్ష అని రాఖీలు కట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ 1000 రోజుల దగాపై బీఆర్ఎస్ సమరభేరి

# హామీల అమలుపై ప్రజల్లోకి వెళ్లాలి.. కార్యకర్తలకు గండ్ర వెంకట రమణారెడ్డి దిశా నిర్దేశం



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ప్రజా స్ఫూర్తి : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తవుతున్న నేపథ్యంలో ఆ పార్టీ ఎన్నికల హామీల అమలుపై ప్రజల్లోకి వెళ్లేందుకు బీఆర్ఎస్ కార్యాచరణ సిద్ధం చేస్తోంది. ఇందులో భాగంగా సెప్టెంబరు 2 నుంచి వారం రోజులపాటు నిర్వహించనున్న 'కాంగ్రెస్ 1000 రోజుల దగాపై బీఆర్ఎస్ సమరభేరి' కార్యక్రమంపై మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి, మాజీ జడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా గండ్ర వెంకట రమణారెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు గ్రామాలు, వార్డుల్లో విస్తృత కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ప్రకటించిన ఆరు గ్యారెంటీలు, 420 హామీల్లో ఎన్ని అమలు చేశారో ప్రజలకు వివరించాలని అన్నారు. నెరవేరని హామీలపై ప్రభుత్వాన్ని నిలదీయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలనలో ప్రజలకు చేసిందేమిటో, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో ఎన్ని నెరవేర్చిందో ప్రజల ముందు స్పష్టంగా ఉంచాలని పేర్కొన్నారు. గ్రామస్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి వరకు నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి సమరభేరి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గండ్ర వెంకట రమణారెడ్డి పిలుపునిచ్చారు.సమావేశంలో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# జాతీయ క్రీడా దినోత్సవంలో ప్రధాని మోదీ వర్చువల్ ప్రసంగం




జయశంకర్ భూపాలపల్లి జిల్లా , ప్రజా స్ఫూర్తి : జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని మై భారత్ ఆధ్వర్యంలో 'ఖేలో ఇండియా సంవాద్-ఖేల్ కీ బాత్, ప్రధానమంత్రి కే సాత్' వర్చువల్ కార్యక్రమాన్ని గురువారం భూపాలపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించారు. జిల్లా యువజన అధికారి భూక్య సంజీవ్ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థినీ విద్యార్థులు ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్ ప్రసంగాన్ని వీక్షించారు.ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు యువతలో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని అన్నారు. యువత క్రీడలను జీవితంలో భాగంగా చేసుకుని ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. ఖేలో ఇండియా కార్యక్రమాల ద్వారా గ్రామీణ, మారుమూల ప్రాంతాల్లోని క్రీడా ప్రతిభను వెలికితీసి ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. యువత ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని క్రీడా రంగంలో ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఏ. రమణరావు, జిల్లా స్పోర్ట్స్ అధికారి రఘు, ఖేలో ఇండియా కోచ్ శ్రీనివాస్, మై భారత్ ప్రోగ్రాం ఆర్గనైజర్ వెల్దండ సురేష్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ కవిత, కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



# ఎండతో ఆరోగ్యానికి అండ



**శరీర ఆరోగ్యానికి విటమిన్లు చాలా అవసరం. వాటిని పొందాలంటే రకరకాల ఆహారపదార్థాలు తినాలి. అయితే, విటమిన్ –డి మాత్రం ఆహారంలోనే కాదు.. ఉచితంగా కూడా లభిస్తుంది. ఉదయం పూట సూర్యరశ్మి నుంచి డి – విటమిన్ పొందొచ్చని అందరికీ తెలుసు. కానీ, ఉచితంగా వచ్చే ఆ విటమిన్ కూడా సరిగా సద్వినియోగం చేసుకోలేకపోతున్నారు చాలామంది. ప్రస్తుత రోజుల్లో చూస్తే.. సూర్యుడి బారి నుంచి తప్పించుకోవాలనే చూస్తున్నారే తప్ప.. అందువల్ల జరిగే ప్రయోజనం గురించి ఆలోచన చేయట్లేదు. ఇలా నిర్లక్ష్యం చేస్తే.. డి – విటమిన్ లోపిస్తుంది. దానివల్ల చాలా అనారోగ్య సమస్యలు వస్తాయి అంటున్నారు నిపుణులు. ఈ అంశం గురించి పూర్తిగా తెలుసుకోవాలంటే ఇది చదివేయండి.**

విటమిన్–డి ఎముకల్ని దృఢంగా ఉంచుతుంది. కొన్ని క్యాన్సర్లు రాకుండా అడ్డుకుంటుంది. ఇన్ని లాభాలున్నా భారతీయులకు మాత్రం డి – విటమిన్ లోపం ఉంటోందని స్టడీలో తేలింది. ప్రతి నలుగురిలో ముగ్గురికి విటమిన్–డి లోపం ఉంటోంది. పోయినేడాది ఓ సర్వేలో దాదాపు 76 శాతం మంది విటమిన్–డి లోపంతో బాధపడుతున్నారని తేలింది. అందులో ముఖ్యంగా 25 ఏళ్ల కంటే తక్కువ వయసున్న వాళ్లేనట.

### డిప్రెషన్ డి కారణమా?

ఇటీవల జరిగిన ఓ అధ్యయనం ప్రకారం విటమిన్ – డి లోపం డిప్రెషన్ కు దారి తీస్తుందట. డిప్రెషన్‌తో బాధపడుతున్న వ్యక్తుల రక్తంలో విటమిన్ – డి తక్కువగా కలిగి ఉంటారని పరిశోధనలో తేలింది. విటమిన్ – డి అందిన తర్వాత వారి మానసిక స్థితిలో మెరుగుపడిందని ఈ అధ్యయనం తెలిపింది. ఫంక్షనల్ న్యూట్రిషనిస్ట్ ముగ్ధ ప్రధాన్,సీఈఓ, స్థాపకుడు, ఐత్రైవ్ ప్రకారం, డిప్రెషన్ లో ఉన్న వారి పరిస్థితిని అర్థం చేసుకోవడం చాలా ముఖ్యం. సాధారణంగా డిప్రెషన్ కు అనేక కారణాలున్నప్పటికీ విటమిన్ డి లోపం వల్ల అది దీర్ఘ కాలంలో తీవ్రమైన సమస్యగా మారే ప్రమాదం ఉంది. గర్భధారణ సమయంలో విటమిన్ డి స్థాయిలు తక్కువ ఉండడం.. ప్రసవానంతరం ఎదురయ్యే పరిస్థితులతో ముడిపడి ఉండవచ్చని స్టడీలు చెప్తున్నాయి. ఇది ప్రసవం తర్వాత కొన్ని వారాలు లేదా నెలల వరకు ఆ తల్లులను ప్రభావితం చేస్తుంది. విటమిన్ డి లోపం దీర్ఘకాలిక వెన్నుపాము గాయాలు, స్ట్రోక్, మల్టిపుల్ స్క్లెరోసిస్ కు దారి తీయవచ్చు. ఇది వివిధ మానసిక ఆరోగ్య పరిస్థితులపైనా ప్రభావం చూపుతుంది.

### కాసేపు ఎండలో...

**సూర్యరశ్మి నుంచి మన శరీరానికి అధిక మొత్తంలో విటమిన్ 'డి' అందుతుంది. దానివల్ల ఎముకలు ఆరోగ్యంగా ఉంటాయి. అలాగే నాడీ, కండరాల ఆరోగ్యానికి అవసరం. అంతేకాదు.. రోగనిరోధక వ్యవస్థ పనితీరును మెరుగుపరుస్తుంది. కాబట్టి రోజూ ఉదయాన్నే సూర్యకాంతిలో కనీసం పదిహేను నిమిషాలైనా నిలబడమని నిపుణుల మరీ మరీ చెప్తున్నారు. ఆ విటమిన్ పొందడానికి ఏవేవో ప్రయత్నాలు చేయక్కర్లేదు. సరైన ఫుడ్, సన్‌లైట్ ద్వారా తెచ్చుకుంటే సరిపోతుంది. లేదా డాక్టర్ సలహా మేరకు సప్లిమెంట్స్ కూడా తీసుకోవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. అయితే, అంతదాకా ఎందుకులే అనుకుంటే.. పైన చెప్పినట్టు ఫాలో అయిపోవచ్చు.**

### ఈ సమస్యలన్నీ లోపం వల్లే..

ఒకవేళ ఈ విటమిన్ లోపిస్తే కండరాల బలహీనత, కీళ్ల నొప్పులు, అలసట, ఆందోళన, ఒత్తిడి, జుట్టు రాలడం, దీర్ఘకాలిక జీర్ణ సంబంధిత సమస్యలు.. వంటివి వచ్చే అవకాశం ఉంది. అలాగే చిరాకుగా ఉంటుంది. శక్తిని కోల్పోయినట్లు అనిపిస్తుంది. వీటితో పాటు ఒళ్లు నొప్పులు, చర్మం పొడిబారడం, దురదగా అనిపించడం, జుట్టు రాలి పోయే సమస్యలు తలెత్తుతాయి. ఇమ్యూనిటీ తగ్గుతుంది. ఫలితంగా జలుబు, దగ్గు,జ్వరం వంటి అనారోగ్య సమస్యలు వస్తాయి. నిద్రలేమికి ఇది కూడా ఒక కారణం. డి – విటమిన్ లోపం ఉన్న వారు పదే పదే అనారోగ్యం బారిన పడుతుంటారు. విటమిన్ డి స్థాయిలు మానసిక ఆరోగ్యంపైనా తీవ్ర ప్రభావం చూపిస్తాయి. అంతేకాదు.. కొన్ని రకాల క్యాన్సర్‌లకు కూడా కారణమవుతుంది. దీర్ఘకాలిక వ్యాధులైన అధిక రక్తపోటు, గ్లూకోజ్ స్థాయిల నియంత్రణ, గుండె జబ్బులు, అతిసారం, మూత్రాశయ సమస్యలు, ఏకాగ్రత లేకపోవడం కారణంగా సంబంధిత వ్యాధులు వచ్చే అవకాశం ఉంటుంది.



### ఈ ఫుడ్ తీసుకోవాలి

* ఆవు పాలలో విటమిన్ 'డి' ఎక్కువగా ఉంటుంది. రోజుకు ఒక గ్లాసు ఆవు పాలు తాగడం వల్ల రోజుకి 20 శాతం ఈ విటమిన్ శరీరానికి అందుతుంది.
* పెరుగులో కూడా ప్రొటీన్లతో పాటు 'డి' విటమిన్ ఎక్కువగా ఉంటుంది. కాకపోతే బయటి నుంచి తెచ్చుకోకుండా ఇంట్లోనే పెరుగు తయారుచేసుకుని తీసుకోవడం బెటర్.
* పుట్టగొడుగులు ఎండలోనే పెరుగుతాయి. కాబట్టి వీటిలో విటమిన్ 'డి' స్థాయిలు ఎక్కువగా ఉంటాయంటున్నారు నిపుణులు. దీంతో పాటు బి1, బి2, బి5, కాపర్.. వంటి పోషకాలు కూడా పుట్టగొడుగుల్లో అధికంగా ఉంటాయి.
* కమలాఫలంలో విటమిన్ సి, డిలు పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీరంలో ఇమ్యూనిటీని పెంచుతాయి.
* విటమిన్ 'డి' అధికంగా లభించే పదార్థాల్లో ఓట్స్ కూడా ఒకటి.
* గుడ్డు పచ్చసొనలో విటమిన్ 'డి' తో పాటు ప్రొటీన్లు, కొవ్వులు కూడా ఎక్కువగానే ఉంటాయి. కాబట్టి రోజుకు ఒక పచ్చసొన కంటే ఎక్కువ తీసుకోకూడదట!
* చేపల్లోనూ విటమిన్ 'డి' స్థాయిలు ఎక్కువే. అలాగే ఇందులో ఉండే క్యాల్షియం, ప్రొటీన్లు, ఫాస్ఫరస్.. వంటి పోషకాలు సంపూర్ణ ఆరోగ్యాన్నిస్తాయి.

# మాన్‌సూన్ వెడ్డింగ్‌కి.. ఈ చీరలు బెటర్

**వేడుకలకు సీజన్‌తో పనేముంది? ఎప్పుడైనా ఏదో ఒక వేడుక జరుగుతూనే ఉంటుంది. కానీ, వాటికి వెళ్లాలంటే మాత్రం ఎలాంటి బట్టలు వేసుకోవాలి? అనేది పెద్ద ప్రశ్న. ఎందుకంటే అన్నికాలాలకు ఒకేలాంటి బట్టలు వేసుకోవడం కష్టమైన పని. కాలానుగుణంగా ధరిస్తేనే కంఫర్ట్‌గా ఉంటుంది. మామూలుగా వేడుకలకు వెళ్లే వాళ్లు, ముఖ్యంగా పెండ్లిళ్లకు వెళ్లేవాళ్లు పట్టుచీరలకే ఓటేస్తారు. మరి వానాకాలంలో ఎలాంటి చీరలు కట్టుకుంటే బెటర్ అంటే.. పట్టుచీరలు కష్టం. కాస్త తడిచినా అసౌకర్యంగా ఉంటుంది. కాబట్టి సరైన దుస్తులు వేసుకుంటే ఆ సౌకర్యమే వేరు. అవేంటో తెలుసుకుందాం.**





షిఫాన్... చాలా తేలికగా, కాస్త పలుచగా ఉండే ఫ్యాబ్రిక్. మెత్తగా, లైట్ వెయిట్‌తో ప్రత్యేకంగా, చూడటానికి హుందాగా ఉంటుంది. డ్రెస్సులు, స్కర్టులకు ఈ క్లాత్ చాలా బాగా సెట్ అవుతుంది. దాంట్లో చాలా రంగులు, ప్యాటర్న్స్ ఉంటాయి.

కాటన్... ఒక సాంప్రదాయ, క్లాసిక్ ఫ్యాబ్రిక్. ఇది కూడా చాలా తేలికగా, సౌకర్యంగా ఉంటుంది. డ్రెస్సులు, సూట్లకు కూడా బాగుంటుంది. కాటన్‌లో చాలా రకాల అల్లికలుంటాయి. వేడిని, తేమని తట్టుకుంటాయి.

లెనిన్... ఇది కాటన్ లాగే తేమను బాగా పీల్చుకుంటుంది. ఇది స్టైలిష్ లుక్ ఇస్తుంది. చీర కట్టుకున్నా, డ్రెస్ అయినా బాగుంటుంది.ఇది చూడటానికి చాలా రిచ్‌గా కనిపిస్తుంది. అలాగే సౌకర్యంగానూ ఉంటుంది. రేయాన్ ఫ్యాబ్రిక్ కూడా స్టైలిష్‌గా ఉంటుంది.

# ఆహారాన్ని గొడుగుతో కప్పేద్దాం!



**'ఫుడ్ కవర్'... మీల్స్, టీ, స్నాక్స్ ఏ ఫుడ్ అయినా తినగా మిగిలిపోతే.. దాన్ని అలానే వదిలేయలేం కదా. మూతతో, క్లాత్‌తో కవర్ చేస్తుంటాం. కానీ, ఒక్కోసారి అలా కవర్ చేయడం వల్ల గాలి ఆడక అవి పాడైపోతాయి. అలాగని కవర్ చేయకపోతే.. ఈగలు ముసురుతుంటాయి. ఆ ఆహారాన్ని తినలేం కదా! ఈ సమస్యకు చెక్ పెట్టేందుకే ఈ ఫుడ్ కవర్లు. చూడ్డానికి గొడుగులా ఉన్న ఈ ఫుడ్ కవర్.. వాడడం చాలా తేలిక. గొడుగును వాడినట్టే వాడితే సరి. డైనింగ్ టేబుల్ మీద, ఫ్లోర్ మీద ఎక్కడైనా దీన్నిపెట్టొచ్చు. ఒకవేళ మాసిపోయినా కూడా శుభ్రపరచడం ఈజీనే. పైగా మడిచే సౌకర్యం ఉంటుంది. కాబట్టి వెకేషన్లకు వెళ్లినా వెంట తీసుకెళ్లొచ్చు.**

# ఏం తీసారా బాబూ..



సినిమా ఇండస్ట్రీలో భారీ బడ్జెట్‌తో సినిమాలు తీయడం, అవి బాక్సాఫీస్ వద్ద విజయం సాధించడం సహజమే. అయితే కొన్నిసార్లు ఎంత పెద్ద స్టార్ కాస్టింగ్ ఉన్నా, కోట్లు కుమ్మరించినా సినిమాలు దారుణంగా ఫ్లాప్ అవుతుంటాయి. కానీ, ఏకంగా రూ. 45 కోట్ల బడ్జెట్‌తో నిర్మిస్తే.. థియేటర్లలో కేవలం రూ. 60 వేలు మాత్రమే వసూలు చేసిందంటే నమ్మగలరా? వినడానికి ఆశ్చర్యంగా ఉన్నా ఇది పక్కా నిజం. భారతీయ సినీ చరిత్రలోనే అత్యంత పెద్ద డిజాస్టర్‌గా నిలిచిన ఆ చిత్రం పేరు 'ది లేడీ కిల్లర్'. భారీ అంచనాలు, భారీ బడ్జెట్ మధ్య ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. 2023లో విడుదలైన ఈ క్రైమ్ థ్రిల్లర్ చిత్రంలో బాలీవుడ్ ప్రముఖ నటుడు అర్జున్ కపూర్, క్రేజీ హీరోయిన్ భూమి పెడ్నేకర్ జంటగా నటించారు. అజయ్ బహల్ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ టీసిరీస్ బ్యానర్‌పై భారీ స్థాయిలో రూ. 45 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కించారు. స్టార్ హీరోహీరోయిన్లు, పెద్ద నిర్మాణ సంస్థ ఉండటంతో ఈ సినిమాపై విడుదల ముందు కొన్ని అంచనాలు ఉండేవి. కానీ థియేటర్లలో విడుదలైన మొదటి రోజే ఈ సినిమా పరిస్థితి ఘోరంగా తయారైంది. ఎంతలా అంటే, ఈ చిత్రానికి మొదటి రోజు దేశవ్యాప్తంగా అమ్ముడైన టికెట్లు కేవలం 293 మాత్రమే! మొదటి రోజు కలెక్షన్లు రూ. 38 వేలుగా నమోదయ్యాయి. ఇక ఈ సినిమా థియేట్రికల్ రన్ ముగిసేసరికి సాధించిన మొత్తం వసూళ్లు కేవలం రూ. 60 వేలు. అంటే పెట్టిన బడ్జెట్‌లో ఒక శాతం కాదు కదా, కనీసం ప్రింట్ అండ్ పబ్లిసిటీ ఖర్చులు కూడా రాలేదు.



# సుజయ్ ప్రొడక్షన్స్ & అర్‌ఎన్ క్రియేషన్స్ నూతన చిత్రం ప్రారంభం

యష్ తేజ్, జయశ్రీ జంటగా సుజయ్ ప్రొడక్షన్స్ బ్యానర్ లో అర్‌ఎన్ క్రియేషన్స్ సమర్పణలో చందు దర్శకత్వంలో కె గోపాల్, జె రవీందర్ నిర్మాతలుగా తెరకెక్కబోతున్న ప్రేమకథ చిత్రం పూజా కార్యక్రమాలతో ప్రారంభం అయ్యింది. ఈ కార్యక్రమంలో నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ్ కెమెరా స్విచ్ ఆన్ చెయ్యగా ముహూర్తం సన్నివేశానికి దర్శకుడు వివెన్ ఆదిత్య క్లాప్ కొట్టారు అలాగే మామిడి హరికృష్ణ స్క్రిప్ట్ ను చిత్ర యూనిట్ కు అందజేశారు. ప్రేమించుకొనే యువత తల్లి తండ్రులని దృష్టిలో ఉంచుకుంటే ఏం జరుగుతుంది? ప్రేమలో ఉన్న అబ్బాయి అమ్మాయి వారి పేరెంట్స్ గురుంచి ఎలా ఆలోచిస్తారు? వంటి సంఘటనలతో ఈ సినిమా కథాంశం ఉంటుందని దర్శకుడు చందు చెబుతున్నారు. ఒక సరికొత్త ప్రేమను తెరమీద ఆవిష్కరించబోతున్నందుకు ఆనందంగా ఉందని నిర్మాతలు కె గోపాల్, జె రవీందర్ తెలిపారు. ఈ చిత్రానికి ప్రొడక్షన్ డిజైనర్ భూపతి యాదగిరి, సంగీతం నాగ వంశీ, సినిమాటోగ్రఫీ నాని బిశెట్టి, సురేష్ జిల్లా, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ ఎర్రం రామకృష్ణ.

# టైటిల్ తెలిసేది ఆరోజే!



అగ్ర కథానాయకుడు అక్కినేని నాగార్జున కెరీర్‌లో అత్యంత ప్రతిష్టాత్మకమైన 100వ చిత్రం షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా జరుగుతున్నది. అన్నపూర్ణ స్టూడియోస్ పతాకంపై రూపొందుతున్న ఈచిత్రానికి రా కార్తీక్ దర్శకుడు. నిన్నేపెళ్లాడతా, ఆవిడా మా ఆవిడే చిత్రాల్లో నాగార్జునకు జోడీగా నటించిన టబూ ఈ సినిమాలో కీలక పాత్ర పోషిస్తుండటం విశేషం. నాగార్జున పుట్టినరోజైన ఆగస్ట 29న ఈ సినిమా టైటిల్ గ్లింప్స్‌ను విడుదల చేయనున్నట్టు బుధవారం ఓ ప్రకటన ద్వారా మేకర్స్ తెలిపారు. అభిమానులు పండుగ చేసుకునేలా అద్భుతమైన టైటిల్‌ని ఈ సినిమాకు నిర్ణయించినట్టు వారు చెప్పారు. ఈ టైటిల్ గ్లింప్స్‌లోనే సినిమాకు సంబంధించిన మరిన్ని వివరాలు కూడా వెల్లడికానున్నాయని వారు పేర్కొన్నారు. దేవిశ్రీ ప్రసాద్ ఈ చిత్రానికి సంగీత దర్శకత్వం వహిస్తున్న విషయం తెలిసిందే.

# "రోమాంచకం" మూవీ ట్రైలర్ లాంచ్



బ్లాక్ బస్టర్ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా సమర్పణలో భద్రకాళి పిక్చర్స్ బ్యానర్ నిర్మిస్తున్న సినిమా "రోమాంచకం". సుమంత్ ప్రభాస్, అనంతిక సనిల్ కుమార్ జంటగా నటిస్తున్న ఈ చిత్రాన్ని ప్రణయ్ రెడ్డి వంగా నిర్మిస్తున్నారు. నూతన దర్శకుడు వేణుగోపాల్ రెడ్డి రూపొందిస్తున్నారు. ప్రేమ, హాస్యం, ఉత్కంఠ కలగలిపిన ఇంట్రెస్టింగ్ యూత్ ఫుల్ ఎంటర్ టైనర్ గా ప్రేక్షకుల్ని ఉర్రూతలూగించేందుకు ఈ సినిమా సెప్టెంబర్ 3న వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. ఏషియన్ సినిమాస్ ద్వారా ఈ చిత్రాన్ని సునీల్ నారంగ్ ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటకలో రిలీజ్ చేస్తున్నారు. ఈ రోజు "రోమాంచకం" చిత్ర ట్రైలర్ లాంఛ్ ఈవెంట్ ను హైదరాబాద్ లో గ్రాండ్ గా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హీరోయిన్ అనంతిక సనిల్ కుమార్ మాట్లాడుతూ మా సినిమా చూసి ప్రతి ఒక్కరూ ప్రేమలో పడతారు. మా చిత్రాన్ని ప్రతి ఒక్కరూ ఇష్టపడతారు. ఈ సినిమాలో హీరోయిన్ గా నేను బాగుంటానని నమ్మి అవకాశం కల్పించిన మా డైరెక్టర్, ప్రొడ్యూసర్స్ కు థ్యాంక్స్. ఈ టీమ్ లోని అందరితో హ్యాపీగా వర్క్ చేశాను. ప్రేమ, హాస్యం, ఉత్కంఠ ఏంటో ఫీల్ కావాలంటే సెప్టెంబర్ 3న మా మూవీ చూసేందుకు థియేటర్స్ కు రండి. ఈ సినిమా సెట్ లో జాయిన్ అయిన మొదటి రోజు నుంచే పాజిటివ్ ఫీల్ తో వర్క్ చేశాం. అన్నారు. హీరో సుమంత్ ప్రభాస్ మాట్లాడుతూ సొంత బ్రదర్స్ లా నన్ను ఎంకరేజ్ చేస్తున్న మా సందీప్ అన్న, ప్రణయ్ అన్నకు థ్యాంక్స్. రోమాంచకం క్యూట్ లవ్ ఫిలిం. భద్రకాళీ సంస్థలో ట్రావెల్ అవుతుంటే తెలిసింది సందీప్ అన్న, ప్రణయ్ అన్న ఎంత మంచి మనసున్న వాళ్లో. యాక్టర్ గా ఓపెన్ అప్ అయిపోయి నటించే అందరినీ నవ్వించే అందరూ ఇష్టపడే ఇలాంటి బ్యూటిఫుల్ క్యారెక్టర్ లో నటించే అవకాశం నాకు కల్పించిన మా డైరెక్టర్ వేణు అన్నకు కృతజ్ఞతలు. అనంతిక మంచి పర్ ఫార్మర్, ఏ విద్య నేర్చుకోమన్నా త్వరగా నేర్చుకుంటుంది. సోహన్, వెంకటేష్, నరేంద్ర,..ఇలా మా బ్యాచ్ అంతా నిజంగా స్నేహితులా అనేంత సహజంగా కనిపిస్తాం. నరేంద్ర చేసిన చింటు క్యారెక్టర్ మీ అందరికీ గుర్తుండిపోతుంది. ట్రైలర్ మీ అందరికీ నచ్చితే థియేటర్స్ కు వచ్చేయండి, మీతో పాటు మరికొందరిని తీసుకురండి. భద్రకాళీ పిక్చర్స్ లో వస్తున్న ఫన్ క్యూట్ ఎంటర్ టైనర్ ఇది. మీ ఫ్యామిలీ, ఫ్రెండ్స్ ఎవరితో చూసినా ఎంజాయ్ చేస్తారు. మీరు ఎవర్ని సినిమాకు తీసుకువెళ్లినా డిజప్పాయింట్ కారు. ఆ కాన్ఫిడెంట్ తో సినిమాకు వెళ్లండి. అన్నారు. ఈ సినిమాకు ఫ్యామిలీతో పాటు రండి. మ్యూజిక్ చాలా బాగుంది. సినిమా చూస్తున్నంత సేపు టైమ్ తెలియలేదు. అప్పుడే ఇంటర్వెల్ వచ్చిందా అనుకున్నా. ట్రైలర్ సరదాగా ఎలా ఉందో సినిమా కూడా అలాగే ఉంటుంది. ఈ సినిమాను డెఫనెట్ గా ప్రేక్షకులు చూస్తారు. సినిమా అంతా ఒక ఫ్లోలో కామెడీతో వెళ్తుంటుంది. ట్రైలర్ కోసం ఎక్కడ సీన్స్ కట్ చేయాలో తెలియలేదు. ఇలాంటి స్క్రిప్ట్ నేను రాయలేను. కామెడీకి ఎజెండా ఏమీ ఉండదు, నవ్వించాలి. సినిమాటిక్ అడ్వాంటేజ్ తీసుకోకుండా ఈ రోజుల్లో స్క్రిప్ట్ రాయడం కష్టం. కానీ ఈ సినిమాకు ఆ సినిమాటిక్ అడ్వాంటేజ్ చాలా తక్కువ తీసుకున్నారు. నాకు ఈ మూవీలో నచ్చిన విషయాల్లో అదొకటి. ప్రభాస్ అన్నతో సినిమా చేయడమే నా లైఫ్ లో రోమాంచకం మూవ్‌మెంట్. అన్నారు.

# రెమ్యునరేషన్ భారీగా డిమాండ్ చేసిన గ్లామర్ బ్యూటీ ?!

ప్రముఖ టీవీ సీరియల్ హీరోయిన్ సుహాసిని పేరు సైతం వినిపించింది. అంతేకాదు గుండె నిండ గుడి గంటలు సీరియల్ ఫేమ్ బాలు పేరు వినిపించగా.. తాను వెళ్లడం లేదని వీడియోతో క్లారిటీ ఇచ్చాడు బాలు. ఇక ఇప్పుడు మరో హీరోయిన్ పేరు వినిపిస్తుంది. ఆమె మరెవరో కాదు.. డెబ్జానీ మోదక్. ఈ పేరు గుర్తుందా.. ? తనే ఎన్నెన్నో జన్మల బంధం సీరియల్ ద్వారా తెలుగు తెరకు పరిచయం అయ్యింది. తెలుగు రాకపోయినప్పటికీ తనదైన నటనతో అడియన్స్ హృదయాలు గెలుచుకుంది ఈ బెంగాలీ ముద్దుగుమ్మ. అయితే ఆమెకు బిగ్ బాస్ కోసం వారానికి రూ. 4 లక్షల రెమ్యునరేషన్ ఇవ్వనున్నట్లు టాక్ వినిపిస్తుంది. తెలుగులో ఎన్నెన్నో జన్మల బంధం, సత్యభామ వంటి సీరియల్స్ ద్వారా మంచి పాపులారిటీ సంపాదించుకుంది. అయితే ఈ ముద్దుగుమ్మ ఫ్యామిలీ అడియన్స్ మాత్రమే కాకుండా యూత్ సైతం ఫ్యాన్స్ అయ్యారు. ఇక ఇటీవలే స్మాల్ స్క్రీన్ పై వచ్చే ఎంటర్టైన్మెంట్ షోలలో తన కామెడీ, ముద్దు ముద్దు మాటలతో ఆకట్టుకుంది. దీంతో ఇప్పుడు బిగ్ బాస్ 10లో డెబ్జానీ ఎంట్రీ ఇస్తుండడంతో ఎంటర్టైన్మెంట్ అదిరిపోతుందని.. ముఖ్యంగా యూత్ అట్రాక్షన్ ఎక్కువగానే ఉండనున్నట్లు తెలుస్తోంది. ఇక బిగ్ బాస్ 10లోకి సీరియల్ బ్యూటీ పల్లవి గౌడతోపాటు గుప్పెడంత మనసు ఫేమ్ రక్షిత సైతం ఎంట్రీ ఇవ్వనున్నట్లు టాక్. అలాగే జబర్దస్త్ ఫేమ్ నూకరాజు పేరు సైతం నెట్టింట వైరలవుతుంది. అయితే మరికొన్ని రోజుల్లో ఎవరెవరు హౌస్ లోకి అడుగుపెట్టనున్నారో క్లారిటీ రానుంది.



Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.